Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 74 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 ఏప్రిల్ 2023 గురువారం పేజీలు : 4

## దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 61 వేలు దాటేసిన బంగారం..

ప్రతి రోజూ దేశంలో బంగారం, వెండి ధరల్లో హెచ్చు తగ్గులు సర్వసాధారణంగానే చోటు చేసుకుంటూ ఉంటాయి. అయితే గత రెండు రోజులుగా మాత్రం అంతో ఇంతో తగ్గి ఊరటనిచ్చిన బంగారం నేడు మాత్రం కొనుగోలుదారులకు బిగ్ షాకే ఇచ్చింది. నేడు మళ్లీ బంగారం ధర పెరిగింది. ఆ పెరగడమనేది అసలు పరిగణలోకి తీసుకోలేనంత అయినప్పటికీ ఒకసారి పెరగడమనేది ఆరంభిస్తే.. అది కంటిన్యూ అవుతుంది. ఇప్పటికే బంగారం ధర మరింత పెరగవచ్చుంటూ నిపుణులు చెప్పిన విషయం తెలిం:సిందే. నేడు కొన్ని ప్రాంతాల్లో బంగారం ధర రూ.61 వేలను దాటేసింది. నేడు దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ. 10 పెరిగి.. రూ. 55,310కి చేరుకుంది. ఇక 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.19 పెరిగి రూ.69,340కి చేరుకుంది.

# పేపరు లీకేజీ లొల్లి

## బండి సంజయ్ అరెస్ట్ చుట్టూ అసలేం జరుగుతోంది?



హైదరాబాద్ : వరంగల్ లో జరిగిన పదో తరగతి పరీక్ష పేపర్ లీక్ లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నిన్న ఈ కేసులో ఓ జర్నలిస్ట్ ప్రశాంత్ ను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణలో అతడు టీ బీజేపీ చీఫ్ బండి సంజయ్ కు కాల్ చేసినట్టుగా ఆరోపణలు రావడంతో ఈ కేసులో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పక్కా ఆధారాలు సేకరించినట్టుగా చెబుతున్న పోలీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ను మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్ లో అరెస్ట్ చేశారు. అయితే బండి సంజయ్ ను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారన్న కారణాలను మాత్రం పోలీసులు ఆయనకు మీడియాకు ఇప్పటివరకూ తెలుపలేదు. బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీసు వాహనంలో 'బొమ్మలరామారం' పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు బీజేపీ కార్యకర్తలకు పోలీసులకు మధ్య తీవ్రవాగ్వాదం తోపులాట చోటు చేసుకుంది.

**-ప్రశాంత్ అరెస్ట్ తర్వాత బండి అరెస్ట్ :** వాట్సప్లో ప్రశ్నపత్రం పెట్టిన నిందితుడు ప్రశాంత్ బీజేపీ కార్యకర్త అని సమాచారం. ఈయన మాజీ జర్నలిస్ట్ అని కూడా చెబుతున్నారు. ప్రశాంత్ ద్వారానే సంజయ్కు ప్రశ్నపత్రం చేరిందని పోలీసులు చెబుతున్నట్టు మీడియాలో ప్రచారం సాగుతోంది. మంత్రి హరీష్ రావు కూడా ఇదే ఆరోపించారు. సంజయ్కు ప్రశ్నపత్రం పంపిన ప్రశాంత్.. 2 గంటల్లో 142 సార్లు ఫోన్లో మాట్లాడాడని వెల్లడించారు. లీకేజీ విషయంలో భాగంగానే సంజయ్కు కూడా ఫోన్ చేశాడని ఆరోపించారు. తన ప్రశ్నలకు బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని హరీశ్రావు డిమాండ్ చేశారు. పోలీసులు ఇచ్చిన సమాచారంతోనే మంత్రి హరీశ్రావు ఈ మాటాలు మాట్లాడినట్లు తెలుస్తోంది.

**-బండి సంజయ్ లీక్ చేశాడంటున్న బీఆర్ఎస్ :** బండి సంజయ్ ను ఎందుకు అరెస్ట్ చేశారన్న విషయమ్మై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై తాజాగా బీఆర్ఎస్ మంత్రి హరీష్ రావు ప్రెస్ మీట్ పెట్టి పలు సంచలన ఆరోపణలు చేశారు. మంగళవారం వరంగల్లో జరిగిన ఎస్ఎస్సి పరీక్ష పేపర్ లీకేజీకి సూత్రధారిగా బండి సంజయ్ ఉన్నారని బీఆర్ఎస్ మంత్రి హరీష్ రావు సహా బీఆర్ఎస్ మంత్రులు నేతలు ఆరోపిస్తున్నారు. "వరంగల్లో జరిగిన ఎస్ఎస్సి పరీక్ష ప్రశ్నపత్రం లీక్లో ప్రధాన నిందితుడు ప్రశాంత్ ఇప్పుడు జర్నలిస్టు కాదు బిజెపి కార్యకర్త. పరీక్షకు ఒకరోజు ముందు సంజయ్ తనతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేలా ప్రశ్నపత్రం లీక్ అయ్యేలా చూడాలని సూచించాడు" అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల ద్వారా రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడు ఇబ్బందులకు గురిచేయాలని ప్లాన్ చేశాడని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బండి సంజయ్పై ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సంజయ్ ఆధ్వర్యంలోనే వరంగల్ ప్రశ్నపత్రం ఇష్యూ నిందితుడు ప్రశాంత్ ఎస్ఎస్సీ హిందీ ప్రశ్నపత్రాన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశాడని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ మైలేజీని పొందాలని సంజయ్ ప్రయత్నిస్తున్నారు. అతనిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలి" అని కోరారు. బీజేపీ చేస్తున్న ఇలాంటి చౌకబారు వ్యూహాలకు బలి కావద్దని విద్యార్థులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. చెన్నూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ అధికార బీఆర్ఎస్ ప్రభుత్వం పరువు తీసేందుకు బీజేపీ నేతలు ఉద్దేశ్యపూర్వకంగా బురదజల్లుతున్నారని అన్నారు. "టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రం లీక్ ఇష్యూ అయినా ఎస్ఎస్సీ ప్రశ్నపత్రం లీక్ అయినా బీజేపీ కార్యకర్తలు అలాంటి నేరాలకు పాల్పడ్డారు. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇదంతా చేస్తున్నారు" అని ఆయన అన్నారు. ఈ వ్యూహాలన్నింటి వెనుక ఒక క్రమబద్ధమైన ప్రణాళిక ఉందని... బిజెపి పన్నాగాలను బట్టబయలు చేస్తామని సుమన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు ముందు బిజెపి నాయకులు ప్రశ్న పత్రాలను లీక్ చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూశారని ఆరోపించారు.

**-ఖండించిన బీజేపీ.. రంగంలోకి బీజేపీ పెద్దలు :** బండి సంజయ్ అరెస్ట్ పై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హోంమంత్రి అమిత్ షాకు వివరించారు. పరిస్థితులు అరెస్ట్ కు గల కారణాలను తెలియపరిచారు. తెలంగాణ పోలీసులు సంజయ్ పైన నమోదు చేసిన కేసులను పేర్కొన్నారు. డీజీపీతోనూ కిషన్ రెడ్డి మాట్లాడినట్టు తెలిసింది.

ఇక ప్రధాని నరేంద్రమోడీ సైతం తెలంగాణ బీజేపీ చీఫ్ అరెస్ట్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. బండి సంజయ్ అరెస్ట్ పై బీజేపీ రాష్ట్ర ఇన్ చార్జి తరుణ్ చుగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అరెస్ట్ ను తప్పు పట్టారు. కేసీఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 8న తెలంగాణకు రాబోతున్నారు. ఈక్రమంలోనే పేపర్ లీక్ ల విషయం తెలంగాణలో అధికార బీఆర్ఎస్ కు తలనొప్పిగా మారింది. ఈకేసులో బండి సంజయ్ అరెస్ట్ తో కేసు మలుపుతిరిగింది.




మెదక్: భాజపా క్షుద్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని తెలంగాణ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పదో తరగతి పేపర్ లీకేజీల వ్యవహారంలో సూత్రధారి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయేనని ఆయన ఆరోపించారు.

మెదక్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడారు. భాజపావి దిగజారుడు రాజకీయాలని.. అధికారం కోసం ఏదైనా చేసేందుకు ఆ పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నారని హరీశ్‌రావు విమర్శించారు. పిల్లల భవిష్యత్‌తో ఆటలాడతారా? అని మండిపడ్డారు. దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలని సవాల్ చేశారు. పట్టపగలు స్పష్టంగా దొరికిన దొంగ బండి సంజయ్ అని ఆయన ఆరోపించారు. "వాట్సప్‌లో ప్రశ్నపత్రం పెట్టిన నిందితుడు ప్రశాంత్ భాజపా కార్యకర్తా? కాదా? సంజయ్‌కు అతడు ప్రశ్నపత్రం పంపించింది నిజమా? కాదా? రోజుకో పేపర్ లీకేజీ పేరుతో భాజపా కుట్రలు పన్నిన మాట వాస్తవమా? కాదా? సంజయ్‌కు ప్రశ్నపత్రం పంపిన ప్రశాంత్.. 2 గంటల్లో 142 సార్లు ఫోన్‌లో మాట్లాడాడు. అందులో భాగంగా సంజయ్‌కు కూడా ఫోన్ చేశాడు. ఇది నిజమా? కాదా? ఈ ప్రశ్నలకు భాజపా నేతలు సూటిగా సమాధానం చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ నిందితుల విడుదల కోసం భాజపా నేతలు ధర్నా చేశారని.. విద్యార్థులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా నేతలకు చదువు విలువ తెలియదని ఆక్షేపించారు. ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు భాజపాకు గుణపాఠం చెప్పాలని హరీశ్‌రావు కోరారు. బండి సంజయ్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరుతున్నట్లు చెప్పారు.

## రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే పేపర్ లీకేజీలు..

### బండి సంజయ్‌పై మంత్రి సబిత ఫైర్



వికారాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాటు చేయాలనే ఉద్దేశంతోనే పదో తరగతి ప్రశ్నపత్రాలు బయటకు తీసుకొచ్చి వైరల్ చేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ నుంచి పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వరకు కుట్ర కోణం దాగి ఉందని మంత్రి తెలిపారు. కేంద్రంలోని బీజేపీ పెద్దల పర్యవేక్షణలోనే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీకేజీల కుట్రకు పాల్పడ్డారని మంత్రి పేర్కొన్నారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ఐదు లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుగుతారా..? అని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేసిన రాజశేఖర్, పదో తరగతి పేపర్ లీకేజీలో పాత్ర ఉన్న ప్రశాంత్‌లకు బీజేపీ నాయకులతో సంబంధాలు ఉన్నాయన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరులో పదో తరగతి పేపర్ బయటకు తీసుకొచ్చి వైరల్ చేసిన టీచర్ కూడా బీజేపీ అనుబంధ సంఘం సభ్యులు అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనుకునేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అని మంత్రి సబితా హెచ్చరించారు.

# పార్లమెంట్‌తో తెలంగాణ ఎన్నికలు?



## భారీ స్కెచ్ గీసిన బిజెపి పెద్దలు!?

హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయని ప్రశ్నిస్తే అందరూ చెప్పే సమాధానం 'డిసెంబర్' అని.. కానీ ఈసారి కేంద్రంలోని బీజేపీ పెద్ద ప్లాన్ చేస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ ను తెలంగాణకే పరిమితం చేయాలంటే.. రాష్ట్రం దాటకుండా జాతీయ రాజకీయాల్లోకి రానీయకూడదంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం జరపకూడదంటూ బీజేపీ స్కెచ్ గీసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే 2024లో మేలో జరిగే సార్వత్రిక ఎన్నికలతోపాటే తెలంగాణ సహా 5 రాష్ట్రాల ఎన్నికల ను జరపాలని కేంద్రంలోని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఈ రాష్ట్రాల కాలపరిమితి ముగియగానే రాష్ట్రపతి పాలన విధించి మే నెలకు పోస్ట్ పోన్ చేయాలని చూస్తున్నాయి. పార్లమెంట్ తోపాటు తెలంగాణ ఎన్నికలు జరిగితే కేసీఆర్ రాష్ట్రానికే పరిమితం అవుతాడని.. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి రాకుండా నిరోధించవచ్చన్న ప్లాన్ ను బీజేపీ చేస్తున్నట్టు సమాచారం.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇప్పటికే జమిలీ ఎన్నికల కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేసి దేశంలో అన్ని రాష్ట్రాల అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి ప్లాన్ చేస్తున్నాయి. సాధ్యాసాధ్యాల పై కసరత్తు చేస్తున్నాయి. బలమైన పోటీదారులు అయిన మమతా బెనర్జీ కేసీఆర్ కేజ్రీవాల్ లాంటి వారిని ఒంటరిగా వెళితే ఎదుర్కోలేమని.. సార్వత్రిక ఎన్నికలతోపాటే కొట్టాలని బీజేపీ భావిస్తోంది. బీజేపీకి అసెంబ్లీకి పార్లమెంట్ కు ఒకటే ఓటు పడడం ఖాయమని.. ఇలా చేస్తే రాష్ట్రాల్లోనూ అధికారం దక్కుతుందన్న ఆశ బీజేపీకి ఉంది. అందుకే ఈసారి డిసెంబర్ లో తెలంగాణ ఎన్నికల కాలపరిమితి ముగియగానే ఎన్నికలకు వెళ్లకుండా రాష్ట్రపతి పాలన విధించి తెలంగాణలో పరిస్థితులన్నీ చక్కదిద్దాక మేలో సార్వత్రిక ఎన్నికలతో కలిపి ఎలక్షన్ నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. అలా అయితే కేసీఆర్ ను దెబ్బకొట్టడంతోపాటు బీజేపీకి అధికారం రాష్ట్రంలో దక్కుతుందని చూస్తోంది.

## సంపాదకీయం

### పీకే టీం లీడర్స్ చేతులు ఎత్తేశారా...?

వైసీపీ కోసం పీకే టీం పనిచేస్తున్న సంగతి తెలిసిందే. వారే ఇపుడు పార్టీకి దిక్సూచిగా ఉంటున్నారు. వారే కళ్ళూ ముక్కూ చెవులుగా చేసుకుని వైసీపీ అధినాయకత్వం గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ ని ఎప్పటికపుడు తెలుసుకుంటోంది. అయితే పీకే టీం ఇస్తున్న సర్వే నివేదికలు అధినాయకత్వానికి చేదు నిజాలను ఎప్పటికపుడు తెలియచేస్తున్నాయి. వైసీపీకి అంతకంతకు పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను పీకే టీం కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తోంది. దాంతో ఒక వైపు చూస్తే నిబ్బరం చెదురుతోంది. ధీమా స్థానంలో దిగులు కూడా ఆవహిస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే పీకే టీం కూడా ఇపుడు చేతులు ఎత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని అంటున్నారు. ఎలా ఉంది అంటే పీకే టీం 2019 ఎన్నికలో స్ట్రాంగ్ గా నిలబడింది. కావాల్సిన అండదండలు అన్నీ కూడా వైసీపీ క్యాడర్ అందిస్తూ వచ్చింది. నాటి ఉత్సాహం ప్రోత్సాహం వేరుగా ఉండేది. ఇపుడు చూస్తే సీన్ మొత్తం రివర్స్ అయింది. దాంతో పీకే టీం కూడా వైసీపీ క్యాడర్ నుంచి తగిన సహకారం అందకపోవడంతో బయట నుంచి టీం మెంబర్స్ ని రిక్రూట్ చేసుకుంటోందిట. అలా నెల్లూరు ప్రకాశం బాపట్ల జిల్లాలలో పీకే టీం కి ఇంచార్జిగా ఒక మహిళను నియమించరట. ఇక రాజకీయంగా చూస్తే ఆమెకు ఏమీ తెలియదు అని అంటున్నారు. ఇలా ఏదో యూనివర్శిటీ నుంచి డిగ్రీ చేసినవాళ్ళను ఎంచుకుని మరీ పీకే టీం ఇపుడు రిక్రూట్ చేసుకుంటోందిట. ఈ పరిస్థితులలో వైసీపీ క్యాడర్ నుంచి పీకే టీం కి ఫోన్ చేసినా ఆ మహిళ ఫోన్ కూడా లిఫ్ట్ చేయడంలేదుట. ఆమె మాత్రమే కాదు ఇలా కొత్తగా రిక్రూట్ అయిన వారు కూడా ఏమీ పెద్దగా పనిచేయడంలేదు అని అంటున్నారు. అంటే ఏదో మొక్కుబడిగా తూతూమంత్రంగానే గ్రౌండ్ లెవెల్ లో పీకే టీం యాక్టివిటీస్ జరుగుతున్నాయా అన్న చర్చ అయితే బయల్దేరింది. మరి అదే అసలైన నివేదికలుగా పక్కా నిక్కచ్చి సర్వేలుగా భావించి హై కమాండ్ ముందుకు వెళ్తే ఎంతవరకూ కరెక్ట్ అని అంటున్నారు. నిజానికి పీకే టీం గతంలో చేసిన ప్రతీ సర్వేకూ ఒక పద్ధతి విధానం ఉండేది. అవి చాలా మటుకు నిజాలే అయ్యేవి. కానీ ఇపుడు టీం పేరిట ఎవరిని పడితే వారిని రిక్రూట్ చేసుకుని కథ నడిపిస్తూంటేనే రాజకీయంగా తేడాలు వచ్చేస్తున్నాయని అంటున్నారు. మరి పీకే టీం నే ముందు పెట్టుకుని వారు ఇచ్చిన సమాచారమే తమకు అతి పవిత్రమని భావించడం వల్ల హై కమాండ్ కి వాస్తవాలు తెలుస్తాయా అన్న డౌట్లు చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరి ఎంతో డబ్బు ఇచ్చి పీకే టీం ని జనాల్లో తిప్పుతూంటే వారు తమ టీం మెంబర్స్ ని ఇలా ఎందుకు సెలెక్షన్ చేసుకుంటున్నారు అన్న చర్చ కూడా ముందుకు వస్తోంది. అంటే వారిలో కూడా గత ఉత్సహాం సన్నగిల్లిందా లేక ఎక్కడికి వెళ్ళినా ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంది కాబట్టి రొటీన్ గానే సర్వేలు చేసి నివేదికలు పంపిస్తే సరిపోతుందని భావిస్తున్నారా అన్నదే సందేహంగా ఉంది అంటున్నారు ఏది ఏమైనా ఇలా నాసిరకంగా కనుక పీకే టీం మెంబర్స్ యాక్టివిటీస్ ఉంటే కనుక ఆ విషయంలో అలెర్ట్ కావాల్సింది అధినాయకత్వమే అని అంటున్నారు. మొత్తానికి చూస్తే పీకే టీం సైతం ఇపుడు చేతులెత్తేసినట్లే ఉందని అంతా చర్చించుకోవడం విశేషం.

# వసూళ్లలో వీరులు



వేములవాడ: ప్రభుత్వం వేలాది రూపాయలను జీతాలుగా చెల్లిస్తోంది. అవి చాలవన్నట్లు ప్రజల నుంచి అందిన కాడికి దండుకోవడం అలవాటైపోయింది. ఏ చిన్న దస్త్రం కదలాలన్నా వారు అడిగినంత ముట్టజెప్పనిదే దస్త్రం కదలని దుస్థితి నెలకొంటుంది. దీంతో బాధితులు విసిగిపోతున్నారు. చివరకు అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయించడంతో ఉద్యోగులు జైలు పాలవుతున్నారు. అయినా వారిలో మార్పు రాకపోవడం గమనార్హం. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు కూరగాయల మార్కెట్ పనులు, డంపింగ్ యార్డు పనులకు గడువు పొడిగించేందుకు రూ.50 వేలు డిమాండ్ చేసి రూ.30 వేలు తీసుకుంటూ మంగళవారం అనిశాకు చిక్కడం కలకలం రేపింది. కొద్ది రోజుల కిందటే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్ర ప్రకాష్ ఆగస్టులో పట్టణంలోని బద్దిపోచమ్మ వీధికి చెందిన ఓ బాధితుడికి స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు రూ.6 వేలు లంచం తీసుకొని ఠాణా ముందు రెడ్ హ్యాండెడ్‌గా అనిశాకు చిక్కడం పోలీస్‌శాఖలో గుబులు రేపింది. ఏ కార్యాలయంలో చూసినా ఎంతో కొంత చేతులు తడపనిదే పని కావడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

ప్రతి పనికో రేటు...వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు పని పూర్తి కావాలంటే ఎంతో కొంత ముట్టజెప్పనిదే కార్యాలయాల్లో దస్త్రాలు కదలడం లేదనే ఆరోపణలున్నాయి. ఇలాంటి పరిస్థితిలో లంచం ఇచ్చుకోలేని వారు అనిశాని ఆశ్రయించి పట్టిస్తున్నారు. అయినా చాలా మంది అధికారులు, సిబ్బంది భయపడటం లేదు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఎక్సైజ్, అటవీశాఖ, ఉప ఖజానా కార్యాలయాల్లో పని చేస్తున్న కొందరిపై ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని కార్యాలయాల్లో లంచం ఇవ్వకుంటే నానా కొర్రీలు పెట్టి బాధితులను చెప్పులరిగేలా తిప్పుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ప్రతి పనికో రేటు నిర్ణయించి అందిన కాడికి దండుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో కొందరు బాధితులు ఎంతో కొంత ముట్టజెప్పుకొని పనులు పూర్తి చేసుకోగా, డబ్బులు ఇచ్చే స్తోమత లేని వారు అనిశాను ఆశ్రయిస్తున్నారు. అనిశా ఉచ్చులో కొంతమంది ఉద్యోగులు చిక్కుతుండగా, మరి కొందరు చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. వేములవాడలో ఇప్పటి వరకు రెవెన్యూ, ఉప ఖజానా, పంచాయతీరాజ్, మున్సిపల్, ఇలా ప్రభుత్వ శాఖల అధికారులు లంచాలు తీసుకుంటూ అనిశాకు పట్టుబడటం చర్చనీయాంశమైంది. పైసలు తీసుకుంటూ అనిశాకు చిక్కి అవినీతి మరకను మూట గట్టుకుంటూ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతున్నారు.

గతంలో ఇలా...వేములవాడ మండలంలోని రుద్రవరం శివారులో 9 ఎకరాల భూమికి సంబంధించి ఏప్రిల్ 2019లో లేఅవుట్ అనుమతులిచ్చేందుకు వీటీఏడీఏ ప్లానింగ్ అధికారి లక్ష్మణ్ రూ.10 లక్షలు డిమాండ్ చేసి రూ.6.50 లక్షలు లంచంగా తీసుకుంటూ అనిశాకు చిక్కాడు. వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేసిన సత్యనారాయణ భూమి సర్వే చేసేందుకు రూ.20 వేలు లంచంగా తీసుకుంటూ నాలుగేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద అనిశా అధికారులకు పట్టుబడ్డాడు. బోయినపల్లి మండలంలోని తడగొండకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి నూతన పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 3 లక్షల బిల్లు చెల్లించేందుకు గతంలో డీఈ మహేందర్ రూ.70 వేలు తీసుకొని అనిశా వలలో చిక్కారు. వేములవాడ గ్రామీణ మండలంలోని మల్రెడ్డిపల్లికి చెందిన ఓ రైతు వద్ద గతంలో రూ.3 వేలు లంచం తీసుకుంటూ ఓ వీఆర్‌వో అడ్డంగా దొరికిపోయాడు. లంచాలకు మరిగి చివరకు జైలు పాలవుతున్నా తోటి ఉద్యోగుల్లో ఏ మాత్రం మార్పు రాకపోవడం కొసమెరుపు.

# కునుకు కరవాయె.. పంట పాడాయె!



సిరిసిల్ల: రైతులు ఆరుగాలం శ్రమిస్తూ పండించిన పంట చేతికందే వరకు కంటి మీద కునుకు లేకుండా కాపాడుకోవాల్సి వస్తుంది. ఓ వైపు అధిక వర్షాలతో పంటలకు నష్టం జరుగుతుండగా, మరో వైపు అటవి జంతువుల దాడితో ఒక్కరోజులోనే పంట పూర్తిగా పాడవుతుంది. అటవి జంతువుల నష్టంతో పరిహారం అందిస్తామని ప్రకటనలు చూడడమే కానీ.. ఏ ఒక్క రైతుకు అందిందిలేదు. వారికి తెలియజేసేందుకు కనీసం అవగాహన కల్పించాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. అటవి గ్రామాల్లో జంతువులు పంటలను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి. సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్‌తో పాటు పలు మండలాల్లో అటవీ గ్రామాల్లో అడవి పందుల వల్ల మొక్కజొన్న, వరిపంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. ప్రస్తుతం కేవలం అటవి గ్రామాల్లోనే కాకుండా పందుల సంఖ్య పెరిగిపోవడంతో అంతటా కనిపిస్తున్నాయి. దీనివల్ల పంటలను కాపాడుకునేందుకు చేను చుట్టూ విద్యుత్తు కంచెలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాదమని తెలిసీ అక్కడక్కడా తప్పడంలేదు. దీనివల్ల అనేక మంది విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంతోపాటు, వ్యవసాయ బావుల ఆధారంగా జిల్లాలో ప్రస్తుతం 3.09 లక్షల ఎకరాలు వరిసాగు చేశారు. దీనివల్ల సమీప అటవీ గ్రామాల్లో అడవి పందులు, కోతులు. ఇతర వన్యప్రాణులతో వందల ఎకరాల్లో పంటలను నాశనమవుతున్నాయి.

ప్రత్యామ్నాయంపై అవగాహన ఏదీ?

అటవి జంతువుల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం అందించే విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో రైతులకు భారీ నష్టం జరుగుతుంది. అడవి పందులను వేటాడేందుకు దరఖాస్తు చేసుకుంటే వాటిని చంపేందుకు అవకాశమున్నప్పటికీ రైతుల్లో వాటిపై అవగాహన లేకపోవడంతో విద్యుత్తు కంచెలను అమర్చాల్సి వస్తుంది. దీనికి తోడు పంట సంరక్షణకు భారత వ్యవసాయ పరిశోధన సంస్థ సూచించిన సౌరశక్తి కంచెలు, కందకాలు, వలయాకార, ఇనుప ముళ్ల కంచెల గురించి రైతులకు అవగాహన కల్పించాల్సిన వ్యవసాయాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అడవి పందుల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే రెండు రోజుల్లో సంబంధిత అటవి అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ, రెవెన్యూ, అటవి అధికారులు సంయుక్తంగా పంట నష్టాన్ని పరిశీలించి నివేదిక తయారు చేస్తారు. ఉన్నతాధికారులకు పంపిస్తే వారు పరిశీలించి ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ తరువాత రైతుకు పరిహారం అందజేస్తారు. కానీ రైతులకు అవగాహన లేపోవడంతో ఎక్కడా పరిహారం అందిన దాఖలాలు లేవు. అధికారులు రైతులకు అవగాహన కల్పించి పరిహారంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

కౌలుకు తీసుకుని సాగు చేశా– ఏలూరి రాజిరెడ్డి, సారంగాపూర్

గతేడాది ప్రభుత్వం యాసంగి వరిపంట సాగు వద్దనడంతో కౌలుకు తీసుకుని బీడుగా ఉంచాల్సి వచ్చింది. ప్రస్తుతం వరిసాగు చేయగా, అడవి పందులు పంటను పూర్తిగా పాడు చేస్తున్నాయి. అధిక వర్షాలతో ఇప్పటికే పొలం నుంచి వరద కొనసాగుతుండగా, అడవి పందులు మరింత పంటను నష్టం చేస్తున్నాయి. వ్యవసాయ, అటవిశాఖ రైతుల వారీగా నష్టపోయిన పంటలను పరిశీలించి, పరిహారం అందించేలా చూడాలి.

# వెలుగుల కోట.. సేవల బాట

కరీంనగర్ :దక్షిణాదికి వెలుగులు పంచుతున్న రామగుండం ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ ఉద్యోగులు స్వచ్ఛంద సేవలో ముందు నిలుస్తున్నారు. నిరుపేదలకు సేవ చేయాలని నెలకొల్పిన 'సాయి సేవా సమితి' ఆదర్శంగా నిలుస్తోంది.. రూ.1 విరాళంతో ప్రారంభించిన సమితి నిధి నేడు రూ.40 లక్షలకు చేరుకుంది. దానిపై వచ్చే వడ్డీతోపాటు దాతల సహకారంతో అన్నదానం, విద్యా బోధన, వైద్య సేవలో తరిస్తున్నారు. సాయి సేవా సమితిలో దాదాపు 18 మందికి వేతనాలు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తుండగా.. ప్రస్తుతం 150 మంది దాతల సహకారంతో స్వచ్ఛంద సేవ కొనసాగుతోంది. సుదీర్ఘ కాలం స్వచ్ఛంద సేవలో నిలుస్తున్న సాయిసేవా సమితి బుధవారం 23వ వార్షికోత్సవం జరుపుకొంటోంది. 19 అక్టోబరు 1999లో ఈ ప్రాంత నిరుపేదలకు సేవ చేయాలని ఎన్టీపీసీ ఉద్యోగులైన రాందాస్, రమేష్‌బాబు, అశోక్‌రెడ్డి, అప్పలనాయుడు, రామకృష్ణ షిర్డీకి వెళ్లి సాయినాథుని ఆశీర్వాదం పొందారు. ఈ క్రమంలో సాయిసేవా సమితిని నెలకొల్పి సేవ చేయాలని మేడిపల్లి కూడలి సమీపంలో ఎన్టీపీసీకి చెందిన క్వార్టర్లను అద్దెకు తీసుకొని స్వచ్ఛంద సేవను మొదలుపెట్టారు. అన్నదానం, ఆధ్యాత్మికం, విద్యా బోధన, వైద్య సేవ, మహిళలకు వృత్తి శిక్షణ ఇస్తూ ఆదర్శంగా సేవ చేస్తోంది. ఓ క్వార్టర్‌లో ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో ఈ ప్రాంత యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. 12 మంది బ్యాచ్‌గా మూడు నెలల పాటు ఉచితంగా కుట్టుశిక్షణ ఇస్తున్నారు.శిక్షణ అనంతరం సీఎస్సార్ ఆధ్వర్యంలో ధ్రువపత్రాన్ని అందిస్తున్నారు. సేవా సమితి ప్రారంభించిన పదేళ్ల అనంతరం సాయి ఉచిత పాఠశాలను నెలకొల్పారు. కేఎస్ఎన్.రాజు, కేఎస్.మోహన్ పర్యవేక్షణలో ఆరుగురు ఉపాధ్యాయినులచే విద్యా బోధన మొదలుపెట్టారు. వీరితోపాటు ఎన్టీపీసీ అధికారి కేఎస్.మోహన్, మరో మహిళ ఈ పాఠశాలలో స్వచ్ఛందంగా బోధన చేస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు నిరుపేద కాలనీలకు చెందిన 110 మంది చిన్నారులు విద్యాభ్యాసం కొనసాగిస్తుండగా, ఎక్కువ మంది చిన్నారులు పాఠశాలకు రావాలని ఆర్టీసీ బస్ పాస్‌లను కూడా ఇప్పించారు. విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం కూడా ఉచితంగా అందజేయడంతో పాటు దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు, పెన్నులు, యూనిఫామ్‌లను ఇప్పిస్తున్నారు. విద్యార్థులకు భగవద్గీత పారాయణం, యోగా, క్యారమ్స్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షలకు ప్రతి ఏటా ఈ పాఠశాలలో విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. సేవా సమితి ఆవరణలో ప్రతి గురు, ఆదివారం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా దాతల వివాహ, పుట్టినరోజు, ఇతర సందర్భాల్లో



కూడా అన్నదానాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనం కూడా ఇక్కడే అందిస్తున్నారు. ఇటీవల నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు కూడా నిత్యం జరుగుతున్నాయి. నామమాత్రపు రుసుముతో రక్త, మల, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ప్రత్యేక ల్యాబ్ సౌకర్యం కూడా ఉంది. ఈసీజీ సౌకర్యం కూడా ఉంది. ఉచితంగా ఔషధాలు ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్యురాలు డా.శోభారాణి సాయి సేవా సమితి ఆవరణలో వైద్య సేవలు అందిస్తున్నారు. సీఎస్సార్ సహకారంతో రక్తదాన శిబిరాలు, నేత్ర వైద్య శిబిరాలను కూడా ప్రతి ఏటా నిర్వహిస్తే వైద్య సేవలో తరిస్తున్నారు.

ప్రతి ఏటా కొత్త కార్యవర్గం

బయ్యపు అశోక్‌రెడ్డి, వ్యవస్థాపకులు

సాయిసేవా సమితి మరింత అభివృద్ధి పథంలో నిలవడానికి ఏటా కొత్త కార్యవర్గాన్ని నియమించుకుంటున్నాం. సాయిసేవా సమితిలో పనిచేసే వారికి ప్రతి ఏటా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దుస్తులు, బహుమతులను అందిస్తున్నాం. ఈ ప్రాంతంలోని దాతలే కాకుండా, విదేశాల నుంచి కూడా స్వచ్ఛంద సేవ చేయడానికి ముందుకు వస్తున్నారు. ఐదుగురితో ప్రారంభమైన స్వచ్ఛంద సేవలో నేడు 150 మందికి పైగా భాగస్వాములవుతున్నాం.

# విస్తరణకు బృహత్తర మార్గం

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. పాతికేళ్ల నాటి రోడ్లను బృహత్తర ప్రణాళిక(మాస్టర్ ప్లాన్) ప్రకారం విస్తరించేందుకు నిర్ణయించారు. ఇప్పటికే మొదటి విడతలో మూడు ప్యాకేజీల్లో రహదారులు, డ్రైనేజీల పనులు చేయగా ఆయా ప్రాంతాల్లో దీనిని అమలు చేశారు. రెండో విడతలో రహదారుల పనులు ప్రారంభించనుండటంతో క్షేత్రస్థాయిలో పట్టణ ప్రణాళిక అధికారులు కొలతలు ప్రారంభించారు. ఒకటెండ్రు చోట్ల తప్పించి అవసరమున్నంత మేరకు కూల్చివేతలు చేపట్టారు. మిగతా ప్రాంతాల్లో కూడా ఆక్రమిత భాగాన్ని స్వాధీనం చేసుకునేలా కసరత్తు చేస్తున్నారు.

స్మార్ట్ సిటీలో..నగరంలో స్మార్ట్‌సిటీ కింద పనులు చేస్తుండగా కచ్చితంగా 30 ఫీట్ల పైబడిన రహదారులే ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఆ మేరకు పనులు చేపట్టాల్సి ఉండగా కొన్ని పాత ఇళ్లు ఉండటంతో ఇంటి యజమానులను ఒప్పిస్తున్నారు. కొత్త ఇళ్లకు అయితే ఎలాంటి నోటీసులు లేకుండా ముందస్తు సమాచారం ఇచ్చి సెట్‌బ్యాక్ స్థలాన్ని రోడ్డు కిందికి తీసుకుంటున్నారు. అవసరమైతే వారికి కూడా నోటీసులు అప్పటికప్పుడే జారీ చేస్తున్నారు. గతంలో రోడ్డును వదలకుండా ప్రహరీలు నిర్మించడం, మెట్లు, ర్యాంపులు ఉండటంతో వాటిని తొలగిస్తున్నారు. కట్టరాంపూర్‌లో పాత ఇళ్లు ఉండటంతో ఇంటి



యజమానులతో మాట్లాడి అభివృద్ధికి సహకరించేలా అధికారులు కోరడంతో ఆయా ప్రాంతవాసులు కొందరు ముందుకొచ్చారు. ఇంకొందరు ఉండగా వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రాంనగర్ చేపల మార్కెట్ వైపు ప్రహరీలు అధికశాతం రోడ్డు విస్తరణలోకి వస్తున్నాయి. టవర్‌సర్కిల్ రాజు టీస్టాల్ వైపు రోడ్డులో ఆక్రమణల తొలగింపుతో పాటు కనీసం ఐదు ఫీట్లు తీసే అవకాశముంది.

కొలతల వ్యత్యాసంపై అభ్యంతరాలు

రహదారి విస్తరణలో భాగంగా పట్టణ ప్రణాళిక అధికారులు కొలతలు నిర్వహిస్తుండగా ఆ తర్వాత జరుగుతున్న ఇంజినీరింగ్ పనులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఒకచోట ఎక్కువ, మరికొన్ని తక్కువ అనే విమర్శలు వస్తుండగా, డ్రైనేజీలు వంకర టింకర నిర్మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. కాపువాడ శివాలయం రోడ్డులో టౌన్‌ప్లానింగ్ ఇచ్చిన కొలతలు తారుమారు అవుతున్నట్లుగా స్థానికులు అంటున్నారు. ఇప్పటి నుంచే మొదటి విడతలో ఎక్కడ కూడా వంకర అనే సమస్య రాకుండా పనులు చేపట్టగా ప్రస్తుతం కూడా అదే మాదిరిగా ముందుకు వెళ్తే ఎవరికి ఎలాంటి సమస్య ఉండదని అంటున్నారు.

ముందే ఆలోచిస్తే...నగరంలో కొత్తగా ఇళ్లను అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు. ప్లాన్ ప్రకారం సెట్‌బ్యాక్ వదలాల్సి ఉండగా అదీ వదలకుండా పునాదులు కూడా నిర్మిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ సమయంలో కచ్చితంగా వెనక్కి జరిపిస్తుండటంతో ఇంటి భవనానికి ముప్పు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో ఇలాగే నిర్మిస్తుండగా ఫిర్యాదులు కూడా జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు వస్తున్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు కొన్ని భవనాలు, నిర్మాణాలు కూల్చివేసిన సంఘటనలు ఉన్నాయి. అయినా ఇంటి యజమానుల్లో మార్పు కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విస్తరించే ప్రాంతాలు ఇవి

రాంనగర్ చేపల మార్కెట్ రహదారి

నాకా చౌరస్తా నుంచి ఓల్డ్ పవర్‌హౌజ్

కాపువాడ శివాలయం నుంచి నాకాచౌరస్తా వైపు

టవర్‌సర్కిల్ సెంట్రల్ లైన్ రాజీవ్‌చౌక్ రోడ్డు

బైపాసు రోడ్డు నుంచి డంపింగ్‌యార్డు రోడ్డు

హౌసింగ్‌బోర్డుకాలనీలో లేఅవుట్ రోడ్లు 10కిలోమీటర్లు

కట్టరాంపూర్ నుంచి డ్యాం వెళ్లు రోడ్డు

బొమ్మవెంకన్న బిల్డింగ్ నుంచి అశోక్‌నగర్

మంగళివాడ నుంచి భూగర్భ శుద్ధి కేంద్రం(ఎస్టీపీ)వైపు

# పైరవీకారులుగా అటెండర్లు

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశమున్నా.. ప్రైవేటు వ్యక్తులు, కొందరు అటెండర్లు పైరవీకారులుగా అవతారం ఎత్తి బల్దియా పరువు బజారున పెడుతున్నారు. ఎక్కువగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పేరు మార్పిడి, నల్లా కనెక్షన్లు, కొత్త ఇంటినెంబర్ల కేటాయింపు కోసం ప్రజలు వస్తుండగా వీరికి సరైన సమాచారం లేకపోవడంతో అక్కడున్న వారు మాటల్లో దించి అంతా తామే ఆ పనులు చేసి పెడుతామని చెప్పి అందినంత దండుకుంటున్నారు. కొందరు అటెండర్ల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరు అధికారులు, విభాగాల సమాచారం కోసం వచ్చే ప్రజల అవసరాలను ఆసరా చేసుకుంటున్నారు. పలువురి నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.100 మొదలుకొని రూ.వేలల్లో తీసుకుంటూ పనులు చేస్తామని తిప్పుకుంటున్నట్లుగా తెలుస్తోంది. సోమవారం ఓ అటెండర్ తీరు ఇలాగే బయట పడింది. సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పి తిప్పుకుంటుండటంతో దరఖాస్తుదారుడు బేజారయ్యారు. కార్యాలయానికి వచ్చిన బాధితులు సదరు కిందిస్థాయి ఉద్యోగిని పట్టుకొని వాగ్వాదానికి దిగి, కొట్టినంతా పని చేశారు. అక్కడున్న వారంతా సముదాయించి పంపించడంతో వివాదం సద్దుమనిగింది.

బోర్డులు ఏవీ?కార్యాలయంలోని విభాగాల గదులు ఎక్కడ ఉన్నాయో తెలియని గందరగోళం నెలకొంది. ఎవరైనా కొత్త వారు వస్తే మూడు అంతస్థులు తిరగాల్సిందే. ఏ విభాగానికి వెళ్లినా సరైన సమాచారం ఇచ్చే వారుండరు. జనన, మరణ విభాగం, సిటిజన్ చార్టర్, నల్లా బిల్లుల చెల్లింపు వంటి కేంద్రాలు మాత్రం కొత్త భవనంలో ఉంది. ఈ విషయం అక్కడికీ ఒకటికి రెండుసార్లు వచ్చే వారికి తప్ప మిగతా వారికి తెలియడం లేదు. ప్రధాన ద్వారం ఎదురుగా ఏ విభాగం ఎక్కడ ఉంటుంది? ఏ అధికారిని సంప్రదించాలనే వివరాలతో బోర్డులు కూడా ఉండటం లేదు.

అందుబాటులో ఉండని అధికారులుఅనుమతులు, ధ్రువీకరణలు, ఫిర్యాదుల కోసం అధికారులను కలవడానికి వస్తే సంబంధిత విభాగాల అధిపతులు అందుబాటులో ఉండటం లేదు. ఇన్‌వార్డులో ఇచ్చి పోవాలని తరుచుగా సమాధానాలు ఇస్తుండగా వాటి పరిష్కారం మాత్రం జరగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు క్షేత్రస్థాయి పర్యటనలు, అధికారిక సమీక్షల పేరుతో కార్యాలయానికి రాకపోవడంతో సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాయంత్రం పూట వచ్చినప్పటికి మళ్లీ మీటింగ్‌ల పేరుతో కాలయాపన చేయడం తప్ప నగరవాసుల గోడు పట్టించుకోవడం లేదని పలువురు బాధితులు ఆగ్రహిస్తున్నారు.

# చివరి దశలో తెగుళ్లు.. అన్నదాత దిగులు

గంగాధర : యాసంగిలో పంటలు సాగు చేసిన అన్నదాతలకు కాలం కలిసిరావడం లేదు. నిన్న మొన్నటి వరకు నీరందక పంటలు ఎండిపోగా.. అదును దాటాక సాగు నీరు రావడంతో కొన్ని ఎకరాలైనా కాపాడుకున్నామని రైతులు భావించారు. చివరి దశలో వడగళ్ల... తెగుళు ఒక దాని తర్వాత మరొకటి రావడంతో అన్నదాత కుదేలయ్యారు. ఎన్నడూ లేనిది ఈసారి రైతన్నను ఆది నుంచి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం అగ్గితెగులు, మెడవిరుపుతో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

అంతటా వరి పంటే.. పెట్టుబడుల భారం

జిల్లాలో ఎస్సారెస్పీ వరదకాలువ, కాళేశ్వరం, ఎల్లంపల్లి జలాలతో యాసంగిలో 2.46 లక్షల ఎకరాల్లో వరిపంట, 23,541 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడులు వెచ్చించారు. అయితే సాగు ప్రారంభ దశలో మొగిపురుగు, ఆకుఎండు తెగులు, కంకి నల్లిపురుగు సోకి పంట ఎదుగుదల లేకుండా చేశాయి. ఇప్పటికే 20 శాతం పంటను నష్టం చేశాయి. ఇది చాలదన్నట్లుగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జిల్లాలో 23,116 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. ఎకరాకు 30-40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా తెగుళ్ల



ఉధృతితో 20 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పెట్టుబడులు పోనూ రెక్కల కష్టం కూడా వృథాగా పోతుందని ఆవేదన చెందుతున్నారు.

విచ్చలవిడిగా మందుల పిచికారీ

వాస్తవానికి పంటల సాగుకు ముందు దుక్కి దున్ని ఆరబెట్టాలి. ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి చేపట్టాలి. విత్తన ఎంపిక కీలకం కాగా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసిన కంపెనీలు విత్తన శుద్ధి చేయకుండా ప్యాకింగు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. తెగుళ్ల బారిన పడ్డను పంటలను ఎలాగైనా కాపాడుకోవాలనే రైతుల అవసరాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అవసరమైన మందులు కాకుండా తమ దుకాణంలో ఉన్న వాటిని అంటగడుతున్నారనే ఆరోపణలున్నాయి.

తీవ్ర నష్టం వాటిల్లింది– మల్లేశం, కారుపాకలపల్లి

మూడున్నరెకరాల్లో వరిపంట వేస్తే తెగుళ్ల ధాటికి పంటంతా దెబ్బతింది. మొగిపురుగు నివారణకు మూడుసార్లు మందు పిచికారీ చేయగా ఇప్పుడేమో అగ్గితెగులు, మెడవిరుపుతో పంటకు నష్టం జరిగింది. మందుల పిచికారీకి రూ.28 వేలు ఖర్చు చేసిన. వడగళ్ల వానలతో వరి, మామిడి, కూరగాయలు నేలరాలి తీవ్ర నష్టం జరిగింది.

పెట్టుబడులూ రావడం కష్టమే– మొగిలిపాలెం మల్లయ్య, నాగిరెడ్డిపూర్

ఏడెకరాల్లో వరిపంట వేస్తే మొదట్నుంచి ఇబ్బందులే వెంటాడుతున్నాయి. చీడపీడలతో పంటలు దెబ్బతినగా నాలుగుసార్లు మందులు చల్లిన. ప్రతిసారి రూ.7 వేల చొప్పున ఇప్పటికే రూ.50 వేలు ఖర్చు చేసిన. అయినా తెగుళు నివారణ కాక పంటలో సగం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు.

పంట మార్పిడితోనే నివారణ – రాజు, మండల వ్యవసాయాధికారి

కొన్నేళ్లుగా ఒకే రకమైన పంట వేయడం, వాతావరణంలో మార్పుల వల్ల వరిపంటకు తెగుళ్లు సోకి నష్టం జరుగుతుంది. మొగి పురుగు, అగ్గితెగులు, మెడవిరుపుతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అగ్గి తెగులు నివారణకు ఐసోప్రోథయోలేన్ 2 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే పంటకు చల్లాలి.

# భర్తీ కాని ఖాళీలు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు, మధ్య తరగతి ప్రజలకు రాయితీపై బియ్యం, ఇతర సరకులు పంపిణీ చేయడానికి ఆహార భద్రత కార్డులను జారీ చేసి చౌకధరల దుకాణాలను ఏర్పాటు చేశారు. పట్టణాలతో పాటు, గ్రామాల్లో జనాభా, రేషన్ కార్డులు, వార్డుల ప్రాతిపదికన చౌకధరల దుకాణాలను ఏర్పాటు చేసి, డీలర్లను నియమించారు. సదరు డీలర్లు రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సరాఫరా చేస్తున్న సరకులను అందజేస్తారు. జిల్లాలోని పలు దుకాణాల్లో వివిధ కారణాలతో డీలర్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఖాళీలు భర్తీ కాకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లాలో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, రాయికల్, ధర్మపురి పట్టణాలతో పాటు 18 మండలాల్లోని గ్రామాల్లో 3.07 లక్షల ఆహార భద్రత,



అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు ఉండగా 8.85 లక్షల మంది లబ్ధిదారులున్నారు. వీరికి సరకులను పంపిణీ చేయడానికి జిల్లాలో 592 రేషన్ దుకాణాలున్నాయి. ఒక్కో రేషన్ దుకాణంలో ఒక్కో డీలర్‌ని నియమించి, వారికి సరకుల పంపిణీ ప్రకారం కమీషన్ అందజేస్తారు. జిల్లాలో పలు కారణాలతో 99 డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల ఖాళీలు నెలల తరబడి భర్తీ కావడం లేదు. డీలర్ల కొరతతో దుకాణాల సంఖ్య తగ్గి, లబ్ధిదారులు సరకులను తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. డీలర్లను నియమిస్తే వారి దుకాణాల్లో సరకులను పంపిణీ చేయడం ద్వారా లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పుతాయి. కొత్తగా ఏర్పడిన గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో పక్కన ఉన్న గ్రామాల నుంచే సరకులను తీసుకుంటున్నారు.

కలెక్టర్ ఆదేశాలు–చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

జిల్లాలో రేషన్ డీలర్ల భర్తీ ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశించారు. డీలర్ల పోస్టులను భర్తీ చేయాలని ఆర్డీవోలకు వివరాలు పంపిస్తాం. నూతనంగా ఏర్పడిన పంచాయతీల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు గ్రామం నుంచి ప్రతిపాదనలు పంపిస్తే, ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# ఆధార్ సవరణకు కొత్త నిబంధనలు




ములుగు : ప్రజల నిత్య జీవితంలో ఆధార్‌కార్డు తప్పనిసరి అయింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త కొత్త నిబంధనలు విధిస్తోంది. నూతనంగా జారీ అయిన మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా ఆధారాలు సమర్పించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉండాలని నిబంధన విధించాయి. సంక్షేమ పథకాల మంజూరు, భూముల రిజిస్ట్రేషన్, బ్యాంక్ పాస్‌బుక్, ఉపాధి హామీ పనుల కల్పన, భూముల క్రయవిక్రయాలు, విద్యార్థుల చదువులు, స్కాలర్‌షిప్, పంటల విక్రయాలకు ఆధార్ తప్పనిసరిగా మారింది. గతంలో సవరణలు సులభంగా చేసుకునే వీలుండేది. ఈ క్రమంలో జరుగుతున్న మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ధ్రువపత్రాలు, వయసును బట్టి కేటగిరీల వారీగా సమర్పించే పత్రాల్లో మార్పులు చేస్తూ ఇటీవల యూఐడీఏఐ నిర్ణయం తీసుకుంది. సవరణలో సరికొత్త మార్పులు చేస్తూ దరఖాస్తు విధానాన్ని మార్చింది.

మూడు కేటగిరీలుగా విభజన

ఆధార్ కార్డును సవరణ చేసుకునే వారిని వయసుల ప్రకారం మూడు కేటగిరీలుగా విభజించారు. గతంలో ఈ విభజన ఉండేది కాదు. రెండు రకాల దరఖాస్తు పత్రాలు ఉండేవి. తాజాగా ఐదేళ్లలోపు పిల్లలను మొదటి, ఐదు నుంచి 18 ఏళ్లు లోపు వారిని రెండు, 18 ఏళ్లు పైబడిన వారిని మూడో కేటగిరీగా విభజించారు. వీరికి వేర్వేరుగా దరఖాస్తులను రూపొందించారు.

పదేళ్లకోసారి పునరుద్ధరణ

ఆధార్ కార్డును పదేళ్లకోసారి పునరుద్ధరించుకోవాలి. చిరునామా స్థానికతను నిర్ధారించుకుంటూ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు కావాల్సిన చిరునామా ధ్రువపత్రాలను జత చేయాలి. ఇంతకు ముందు గెజిటెడ్ అధికారి సంతకంతో వ్యక్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్, తహసీల్దారు జారీ చేసే గుర్తింపు పత్రాన్ని చూపాలి. ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్‌కార్డులో సరైన చిరునామా ఉంటే వాటితో సరి చేసుకోవచ్చు. నీటి పన్ను, విద్యుత్తు, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ ధ్రువపత్రాలు వినియోగించుకోవచ్చు.

పేరులో మార్పు చేయాలంటే..

తప్పరిసరిగా ఫొటో ఉన్న ధ్రువపత్రాన్ని సమర్పించాలి. పదో తరగతి మార్కుల జాబితా, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, సదరం ధ్రువపత్రాల్లో ఏదో ఒకటి జతపర్చాలి. ఉద్యోగులు వారి గుర్తింపు కార్డు, వివాహితులైతే వివాహ ధ్రువపత్రం, తహసీల్దారుచే జారీ చేసే కుల ధ్రువపత్రం సమర్పించవచ్చు.

పుట్టిన తేదీ..: గతంలో పుట్టిన తేదీని మార్చుకునేందుకు నమూనా పత్రాన్ని భర్తీ చేసి గెజిటెడ్ అధికారులతో సంతకం చేస్తే సరిపోయేది. పాన్ కార్డులో ఉన్న పుట్టిన తేదీని అధికారికంగా ధ్రువీకరించుకునే వీలు ఉండేది. చిన్నారులకైతే తప్పనిసరిగా మున్సిపల్ లేదా పంచాయతీ నుంచి జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఇది కూడా ఒకసారి మాత్రమే సవరించుకునే వీలు కల్పించారు. రెండోసారి మార్పు చేసుకోవాలనుకుంటే దిల్లీలోని ప్రధాన కార్యాలయానికి వెళ్లి తగిన వివరణ ఇస్తూ ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

జెండర్(లింగం) తప్పుగా నమోదైతే ఒక సారి మాత్రమే మార్చుకునే వీలుంది. ఇందుకు తప్పనిసరిగా అర్హత గల గుర్తింపు పత్రాన్ని జత చేయాలి. మరోసారి తప్పును సవరించాలంటే ప్రధాన కార్యాలయానికి వెళ్లాల్సిందే.

నిబంధనలు పాటించాలి

దేవేందర్, ఈడీఎం, ములుగు జిల్లా

ఆధార్‌కార్డు పునరుద్ధరణలో పేరుతో చేసే మార్పుల ద్వారా జరిగే మోసాలను అరికట్టేందుకు తాజాగా యూఐడీఏఐ జారీ చేసిన ఆదేశాలను ఆధార్ కేంద్రాల వారు తప్పనిసరిగా పాటించాలి. నిబంధనల ప్రకారం ప్రజలు సరైన ధ్రువపత్రాలతో సవరణ చేసుకోవాలి. ఇది ఒక సారి మాత్రమే చేసుకోవచ్చు. గతంలో మాదిరిగా మళ్లీ మళ్లీ మార్చుకునే వీలు లేదన్న విషయాన్ని గ్రహించాలి.

# మామూలిచ్చుకో.. అనుమతులు తెచ్చుకో!



ములుగు : టీఎస్–బీపాస్ ద్వారా జారీ అవుతున్న భవన నిర్మాణ అనుమతులు దారి తప్పుతున్నాయి. నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు బల్దియా మెడకు చుట్టుకుంటున్నాయి. చెరువులు, కుంటల వద్ద ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్), నాలాల వద్ద బఫర్ జోన్ నిబంధనలు అమలు కావడం లేదు. నిబంధనలు అమలు చేయాల్సిన నీటిపారుదల శాఖ ఇంజినీర్లు కమీషన్లు పుచ్చుకొని ఇష్టానుసారంగా నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారు. వరంగల్ నూతన మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన విధంగా ప్రధాన, అంతర్గత రహదారుల విస్తీర్ణం సరిగా పాటించడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ప్రాథమిక స్థాయిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు మామూళ్లు పుచ్చుకొని అడ్డగోలుగా బిల్డింగ్ పర్మిషన్లకు ఓకే చెబుతున్నారు. నిబంధనల అమలును క్షుణ్ణంగా పరిశీలించాల్సిన గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు మాకెందుకులే అన్నట్లుగా మౌనంగా ఉండిపోతున్నారు. టీఎస్–బీపాస్ అమలు తీరును నెలకోసారి సమీక్షించాల్సిన వరంగల్, హనుమకొండ పాలనాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

నిబంధనలు ఇలా..

టీఎస్–బీపాస్ ద్వారా వచ్చే భవన నిర్మాణ అనుమతుల దస్త్రాల పరిశీలన, అనుమతులు జారీ చేయడంపై రాష్ట్ర పురపాలక శాఖ నిబంధనలు జారీ చేసింది.

అర్జీల మొదటి దశ: టీఎస్–బీపాస్ పోర్టల్ ద్వారా వచ్చే బిల్డింగ్ పర్మిషన్ అప్లికేషన్ ర్యాండమేషన్ సిస్టమ్ ప్రకారం పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల ఏఈలకు వెళ్తాయి. స్థల పరిశీలన వీళ్లే చేస్తారు. చెరువులు, కుంటలు, నాలాలు, ప్రధాన, అంతర్గత రహదారుల నిబంధనలు ఇక్కడే పరిశీలించాలి. 50 శాతం నిర్ణయాలు ఇక్కడే జరుగుతాయి. రెండో దశ: దస్తావేజుల పరిశీలన, సాంకేతిక అనుమతుల పరిశీలన ర్యాండమేషన్ సిస్టమ్ ప్రకారం గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు చూస్తారు. అన్ని సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలి.

మూడోదశ: కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ ఉపకమిషనర్లు భవన నిర్మాణ అనుమతుల ప్రొసీడింగ్‌లు జారీ చేస్తారు.

నివాస గృహాల అనుమతుల జారీలో సిటీప్లానర్, అసిస్టెంటు సిటీప్లానర్లలో జోక్యం లేకుండానే జరుగుతున్నాయి. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పెద్ద భవనాలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాల బిల్డింగ్ అప్లికేషన్లు మాత్రమే చూస్తారు.

ఇవిగో సాక్ష్యాలు

వరంగల్ భద్రకాళి నాలా పరిసరాల్లో బఫర్‌జోన్ నిబంధనలు పాటించకుండానే బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేశారు. ఎల్బీ కళాశాల, ములుగురోడ్, రంగంపేట, హనుమకొండ అలంకార్, కాకతీయ కాలనీల్లో నివాస గృహాలకు అనుమతులు ఇచ్చేశారు. భద్రకాళి నాలా విస్తీర్ణం, బఫర్ జోన్ ఎంత అనేది తేల్చకముందే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమైంది.

కాజీపేట బంధం చెరువు దగ్గర ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ అనుమతులు జారీ చేశారు.

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో భద్రకాళి చెరువు పరిసరాల్లో ఎఫ్‌టీఎల్ నిబంధనలు పట్టించుకోకుండానే భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారు.

వరంగల్ డాక్టర్స్ కాలనీ, గౌతమినగర్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ములుగు రోడ్ కోట చెరువు ఎఫ్‌టీఎల్ నిబంధనలు తూచ్ అంటున్నారు. వరంగల్ దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, రంగశాయిపేట బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. హంటర్‌రోడ్ జంతు ప్రదర్శనశాల ఎదురుగా ఇద్దరు వ్యక్తుల మధ్య స్థల వివాదం కొనసాగుతుండగానే ఇద్దరి వ్యక్తులకు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారు. ఒకే స్థలానికి రెండు అనుమతులు జారీ చేయడంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు.

# నగరపాలికలో అక్రమాల పరంపర!

గోదావరిఖని : విజిలెన్సు అధికారుల విచారణతో రామగుండం నగరపాలికలో అక్రమాలు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వాహనాల కొనుగోలు నుంచి మొదలుకొని తుక్కు చోరీ వరకు ఏ విభాగంలో చూసినా అక్రమాల డొంక కదులుతుండటంతో అధికారుల్లో అయోమయం మొదలైంది. గత కొంత కాలంగా నగరపాలికలో అక్రమాలపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఏడాది క్రితమే నాలుగు వాహనాలను రామగుండం నగరపాలికకు సరఫరా చేయకుండానే బిల్లులు చెల్లించిన వైనంపై పలువురు కార్పొరేటర్లు గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ తుక్కు ఇనుము చోరీపై నగరపాలక అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం చేకూరడం లేదు. హరితహారం, పట్టణ ప్రకృతి వనాలు నిర్మాణం, నిర్వహణలో అనేక అక్రమాలు నెలకొంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రామగుండం నగరపాలికలో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్సుకు చేరిన పలు ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేస్తున్నారు.

పలు అంశాల్లో.. పారిశుద్ధ్య నిర్వహణ కోసమంటూ కొనుగోలు చేసిన వాహనాలకు మార్కెట్ ధరలకంటే అధికంగా చెల్లించినట్లుగా ఆరోపణలున్నాయి. టెండరు నిబంధనలను పాటించకుండా వాహనాలను కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. డంపర్ బిన్స్ కొనుగోలులో అత్యధిక అక్రమాలున్నట్లు సమాచారం. సుమారు ఏడాది క్రితం జాబ్ కార్డు మిషన్, కాంపాక్టర్, జెట్టింగ్ రాడ్ మిషన్, జేసీబీ తదితర యంత్రాలు రామగుండం నగరపాలికకు సరఫరా చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే కంపాక్టర్, జెట్టింగ్ రాడ్ మిషన్‌ను రాత్రికి రాత్రి నగరపాలికకు తెప్పించగా, మరోరెండు వాహనాలు రావాల్సి ఉంది. కొవిడ్ సమయంలో అత్యవసరంగా సరఫరా చేసిన ఫాగింగ్ మిషన్ల బిల్లులు, మిగతా వాహనాల నిర్వహణ బిల్లులు నగరపాలికలో పెండింగ్‌లో ఉన్నందునే సదరు గుత్తేదారు వాహనాలు సిద్ధంగా ఉన్నప్పటికీ నగరపాలికకు సరఫరా చేయలేదనే అభిప్రాయాలున్నాయి.లి పారిశుద్ధ్యంతో పాటు వివిధ విభాగాల్లో కొనుగోలుకు సంబంధించిన టెండరు తాము అనుకున్న వారికే దక్కేలా నిబంధనలను సవరించిన కొందరు ఇంజినీరింగు అధికారులు తమ చేతివాటంతో అక్రమాలకు తెరలేపారనే ఆరోపణలున్నాయి. గతంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఒకే బృందంగా ఏర్పాటు చేసి బడా గుత్తేదార్లకు పనులు దక్కేలా కొందరు ఇంజినీరింగ్ అధికారులు టెండరు నిబంధనలను సవరించగా ప్రతిపక్ష కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తం చేయడంతో ఎట్టకేలకు పనుల వారిగా టెండర్లు నిర్వహించారు. పారిశుద్ధ్య విభాగంలో డీజిల్ వినియోగంలోనే అనేక అక్రమాలు నెలకొన్నాయని గుర్తించిన కమిషనర్ సంబంధిత అధికారులను ఆయా బాధ్యతల నుంచి తప్పించారు. తుక్కు ఇనుమును విక్రయించి జేబులు నింపుకున్న పలువురు ఇంజినీరింగ్ అధికారులు నగరపాలికలో నామమాత్రంగా డబ్బులు జమ చేశారనే ఆరోపణలున్నాయి. ఓ కార్పొరేటర్ బంధువులు అక్రమంగా తుక్కు ఇనుమును తరలించిన వైనం వెలుగులోకి రావడంతో నగరపాలక అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. పట్టణ ప్రకృతి వనాలు, హరితహారం మొక్కల నిర్వహణలో అనేక అక్రమాలు జరిగాయి. నగరంలోని ఓ పట్టణ ప్రకృతి వనంలో క్షేత్రస్థాయిలోకంటే 40 శాతం అదనంగా బిల్లులు చెల్లించినట్లు తేలింది. నగరంలోని ఓ చెరువు కట్టపై సుమారు 250 మొక్కలను నాటి నిర్వహించినట్లుగా గుత్తేదారునకు బిల్లులు చెల్లించగా క్షేత్రస్థాయిలో కేవలం పది లోపు మొక్కలు మాత్రమే ఉన్నట్లు తేలింది. మరో రోడ్డులోనూ కేవలం 15 శాతం మొక్కలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సమ్మక్క జాతర జరిగే ప్రదేశంలోనూ అనేక మొక్కలు నాటి నిర్వహించినట్లుగా గుత్తేదారునకు బిల్లులు చెల్లించినా క్షేత్రస్థాయిలో మొక్కలు కానరాకపోవడం గమనార్హం. గంగానగర్‌లో ‘అమృత్’ నిధులతో నిర్మించిన ఉద్యానవనానికే ‘పట్టణ ప్రకృతి వనం’గా బోర్డు తగిలించారు. నగరంలోని అనేక చోట్ల పట్టణ ప్రకృతి వనం బోర్డులు తప్ప మొక్కల్లేవు.

నివేదిక ఆధారంగా చర్యలు– డాక్టర్ అనిల్‌కుమార్, నగర మేయర్

విచారణ నివేదిక ఆదరంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. వాహనాల కొనుగోలు తదితర అంశాలే కాకుండా రామగుండంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలిం చాల్సిందిగా విజిలెన్సు అధికారులను కోరాము.

# గుట్టుగా బీటీ–3 పత్తి సాగు!

జగిత్యాల : బీటీ–3 పత్తిరకాన్ని సాగుచేయవద్దని ప్రభుత్వం పేర్కొన్నా చాలాచోట్ల ఈ రకాన్ని సాగుచేసినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. గత వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో 2.65 లక్షల ఎకరాల్లో పత్తిని పండించగా కొందరు రైతులు యాసంగిలోనూ పత్తిసాగు చేపట్టారు. పూర్వపు వరంగల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో బీటీ–3 విత్తనాలను సాగుచేసినట్లు శాస్త్రవేత్తలు గుర్తించగా ఈ ప్రాంతాలతో పాటుగా మహారాష్ట్ర నుంచి విత్తనాలను తీసుకువచ్చి జగిత్యాల జిల్లాలోని పలువురు రైతులు కూడా బీటీ–3 విత్తనాలను వేసినట్లు గుర్తించారు. బీటీ–3 విత్తనాలు అంటగట్టిన వ్యాపారులుండగా రైతుల ఆసక్తిని గమనించి పలువురు వ్యాపారులు బీటీ–2 విత్తనాలను కూడా బీటీ–3 పేరిట అమ్మినట్లు తేల్చారు.

నకిలీల బెడద పత్తిలో నకిలీల బెడద అధికంగా ఉండగా గత సీజన్లలో కొన్నిచోట్ల అధికారులు వీటిని పట్టుకుని నిలువరించినా పెద్దఎత్తున రైతుల క్షేత్రాలకు చేరాయి. జిన్నింగ్ మిల్లుల్లోని పత్తి గింజలను తీసుకువచ్చి శుభ్రంచేసి, రంగులు పట్టించి అందమైన కవర్లలో, డబ్బాల్లో నింపి ప్రముఖ కంపెనీల లేబుళ్ల పేరిట గుట్టుగా విక్రయాలు సాగిస్తారు. జిన్నింగ్ మిల్లుల్లో నుంచి పత్తిగింజలను అతి తక్కువ ధరకు తీసుకువచ్చి విత్తనాలుగా చలామణి చేసిపపుడు కొన్ని వందలరెట్ల లాభం వస్తుండటంతో మోసగాళ్లు నకిలీ విత్తనాల చెలామణి చేపడుతున్నారు. లాభం ఎక్కువగా వస్తుందని వ్యాపారులు, జేబులు నిండుతాయని కొన్నిచోట్ల అధికారులు సహకరిస్తుండటంతో నకిలీ విత్తనాలు యథేచ్ఛగా రైతుల క్షేత్రాలకు చేరుతున్నాయి. నకిలీ విత్తనాలను వేసినపుడు మొక్కలు మొలిచి ఎదిగినా కాయలు అతి తక్కువగా వచ్చి దిగుబడి సగానికి పైగా పడిపోతుంది. మరోవైపు చీడపీడల ఉధృతి, సస్యరక్షణ ఖర్చు పెరగటంతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. గ్రామాల్లో, కొన్ని దుకాణాల్లో ఎలాంటి బిల్లులు ఇవ్వనందున రైతులు నష్టపోయిన సందర్భాల్లో కనీసం ఫిర్యాదుకూ నోచుకోవటం లేదు. దీనికిగాను సంబంధిత అధికారులు ఇప్పట్నుంచే దృష్టిసారించి బీటీ3 విత్తనాల అమ్మకాలు, నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా చూడాల్సి ఉంది.

తట్టుకునే శక్తి బీటీ–3 విత్తనాలతో పండించిన పంటపై గ్లైఫోసేట్ గడ్డిమందును పిచికారీ చేసినా పంట మొక్కలకు ఎలాంటి హానీ జరగకపోగా కలుపు పూర్తిగా నివారించబడుతోంది. కానీ బీటీ–2 విత్తనాలను బీటీ–3 పేరిట సాగుచేసి గ్లైఫోసేట్‌ను పిచికారీ చేస్తే పంటంతా ఎండిపోయే అవకాశముంటుంది. గ్లైఫోసేట్ గడ్డిమందును వాడినపుడు మనుషుల ఆరోగ్యాలు దెబ్బతినటం, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందంటూ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర పరిశోధన జరగనందున బీటీ–3 విత్తనాలను ఎట్టిపరిస్థితుల్లోనూ వాడవద్దని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# బొగ్గు రవాణాలో రారాజు

సత్తుపల్లి : యావత్ సింగరేణి వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా పర్యావరణ హితంతో నిర్మించిన అత్యాధునిక కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(సీహెచ్‌పీ) సత్తుపల్లి సొంతం. గాలి కాలుష్యం, రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు బొగ్గు రవాణా కోసం రూ.400కోట్లతో దీన్ని నిర్మించారు. దీనివల్లే ప్లాంట్ ప్రారంభం నుంచి నేటివరకు బొగ్గు రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. మార్చి 31న సత్తుపల్లి ఉపరితల గని వందలక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఛేదించిందంటే దీని చలవే. గతంలో రోడ్డు మార్గం ద్వారా కేవలం 30వేల టన్నుల బొగ్గును రవాణా చేయగా సీహెచ్‌పీ సదుపాయంతో రోజుకు 40వేల టన్నులు రవాణా చేస్తున్నామని జీఎం జక్కం రమేశ్ తెలిపారు. ఈ నేపథ్యంలో సీహెచ్‌సీ ప్రత్యేకతలపై కథనం..

నాలుగున్నర కి.మీ. కన్వేయర్ బెల్ట్

సింగరేణి వ్యాప్తంగా ఇక్కడే నాలుగున్నర కిలోమీటర్ల మేర భారీ కన్వేయర్ బెల్ట్ నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 16 బెల్ట్‌లుండగా 12 కన్వేయర్ బెల్ట్‌లను స్టాకింగ్‌తో, మరో నాలుగు లోడింగ్ కోసం రూపొందించారు. క్రషింగ్ కంపార్ట్‌మెంట్ నుంచి సెకండరీ కాంప్లెక్స్ మీదుగా భారీ బంకర్ వరకు, అక్కడి నుంచి సైలో బంకర్ల వరకు కన్వేయర్ బెల్ట్‌ను పర్యావరణ హితంతో నిర్మించారు. గంటకు 1800 టన్నుల బొగ్గును 1-ఏ, 1-బీ బెల్ట్‌ల నుంచి బొగ్గును తరలించే సామర్థ్యంతో కన్వేయర్ బెల్ట్‌లను ఏర్పాటు చేశారు.



ప్రతి రోజు 40వేల టన్నులు తరలింపు

సైలో బంకర్ల నుంచి ప్రతి రోజు 8 నుంచి 10 వరకు రేకుల బొగ్గును తరలిస్తుంటారు. ఒక్కో రేకులో 59 వ్యాగన్లు ఉండగా ఒక్కో వ్యాగన్‌లో 67.8టన్నుల బొగ్గు లోడింగ్ చేస్తారు. బొగ్గు లోడింగ్‌కు వీలుగా రెండు కిలోమీటర్ల మేర మొత్తం నాలుగు లైన్ల రైల్వేట్రాక్‌ను నిర్మించారు. సీహెచ్‌పీకి 7.50 ఎంవీఏ సామర్థ్యమున్న రెండు సబ్‌స్టేషన్ల ద్వారా కరెంటు సరఫరా చేస్తున్నారు.

మూడు విభాగాల భారీ బంకర్

సైలో బంకర్‌కు తరలించే ముందు మైనస్ 100 ఎంఎం పరిమాణం బొగ్గును నిల్వ చేయడం కోసం 24వేల టన్నుల సామర్థ్యంతో మూడు కంపార్ట్‌మెంట్లతో భారీ బంకర్ నిర్మించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 8వేల టన్నుల సామర్థ్యం ఉంటుంది. ట్రిప్పర్ కన్వేయర్, ఫ్లోగ్ ఫీడర్స్ వంటి యంత్రాలు ఈ బంకర్‌లో పని చేస్తుంటాయి. ఇక్కడి నుంచి బొగ్గును కన్వేయర్ బెల్ట్‌ల ద్వారా సైలో బంకర్లకు తరలిస్తారు.

పెద్ద పెళ్లలు చిత్తు చేసి..

సీహెచ్‌పీలో తొలుత పెద్దపెద్ద బొగ్గు పెల్లలను మూడు కంపార్ట్‌మెంట్లతో నిర్మించిన కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్‌కు డంపర్ల ద్వారా తరలిస్తారు. గంటకు 900 టన్నుల చొప్పున మూడు కంపార్ట్‌మెంట్లలో 2700 టన్నులను బొగ్గును క్రషింగ్ చేస్తారు. కన్వేయర్ బెల్ట్‌పై క్రషింగ్ ఏరియాలకు తరలిస్తూ మూడు విడతల్లో మైనస్ 300 ఎంఎం నుంచి మైనస్ 100 ఎంఎం పరిమాణం వరకు బొగ్గు సిద్ధం చేసి బంకర్‌కు తరలిస్తారు. ఓసీ-2 కన్వేంషనల్ కాంప్లెక్స్‌లోనూ రెండు కంపార్ట్‌మెంట్‌లలో వెయ్యి టన్నులను క్రషింగ్‌ను చేసి బంకర్‌కు తరలిస్తారు. సైలో సామర్థ్యం అదరహో సీహెచ్‌పీలో ప్రధానమైనవి సైలో బంకర్లు. ఒక్కోటి వెయ్యి టన్నుల సామర్థ్యంలో నిర్మించారు. పూర్తి కంప్యూటరైజ్డ్‌తో పని చేసే ఈ సైలో బంకర్లలో ఒక్కో బంకర్ నుంచి గంటకు 5500 నుంచి 6000 టన్నుల బొగ్గును లోడింగ్ చేస్తారు. ఇక్కడ కూడా బొగ్గు లోడింగ్ చేసే సమయంలో ఎలాంటి దుమ్ము లేవకుండా నీటిని చల్లేలా ఏర్పాటు చేశారు.

# విద్యుత్తు వినియోగదారులపై అదనపు భారం

భూపాలపల్లి : ఇతర నిత్యవసర వస్తువుల ధరలు ఏ విధంగా పెరుగుతున్నాయో అదే మాదిరిగా విద్యుత్తు ఉపకరణాల ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. ఈ భారాన్ని కొత్త కనెక్షన్లు తీసుకునే వినియోగదారులపై మోపుతున్నారు. ఫలితంగా గృహ, వాణిజ్య వ్యవసాయ కనెక్షన్లు పొందుతున్న వారిపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికి మూడు నెలలుగా వినియోగదారులపై ఈ అదనపు భారాన్ని విధిస్తున్నారు.

రాయితీ పెంచలేదు..సాధారణంగా ఏటా విద్యుత్తు ఉపకరణాల ధరలు పెరుగుతాయి. కరోనాకి ముందు రెండు నుంచి ఐదు శాతం పెంచేవారు. ఆ తరువాత అంటే గతేడాది నవంబరులో ఒకేసారి 20నుంచి 30శాతానికి పెంచారు. అయితే వినియోగదారులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీని మాత్రం పెంచకుండా స్థిరంగా ఉంచడం గమనార్హం. వ్యవసాయ కనెక్షన్ల కోసం రైతులు మీ సేవ కేంద్రాల్లో రూ.5,295 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు రూపొందిస్తారు. పొలం వద్దకు స్తంభాలు వేయడం, తీగలు లాగడం, బిగించడం, అవసరమైతే నియంత్రిక ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.75వేల రాయితీని అందజేస్తుంది. అంతకంటే ఎక్కువైతే రైతే భరించాల్సి ఉంటుంది. ఇందు కోసం (ఔట్‌రైట్ కంట్రిబ్యూషన్) ఛార్జీలు వేస్తారు. అయితే ప్రభుత్వం చెల్లించే రాయితీ సరిపోకపోవడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

జీఎస్టీ పేరుతో..గృహ, వాణిజ్య కనెక్షన్లపైనా భారం పడుతోంది. వీటికి ప్రభుత్వం ఎలాంటి రాయితీ ఇవ్వదు. కొత్త కాలనీలు, గ్రామానికి దూరంగా ఉండే గృహాలు, ఇతర వ్యాపార సంస్థలు కనెక్షన్లు కావాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు అంచనా వేసి, నివేదికలు ఇస్తారు. దాని ప్రకారమే విద్యుత్తు లైన్ ఛార్జీలు చెల్లించాలి. ఇప్పటికే వినియోగదారులు తీసుకునే మీటర్లపై జీఎస్టీ పేరిట 18శాతం అధిక ఛార్జీలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పెరిగిన ఉపకరణాల ధరలు వీటికి తోడయ్యాయి. కొత్త కాలనీల్లో ఒక నియంత్రిక (ట్రాన్స్‌ఫారం), నాలుగు స్తంభాలు కావాలంటే మూడు నెలల క్రితం దాదాపుగా రూ.1.50 లక్షల వరకు ఖర్చు అయ్యేది. తాజా ధరల ప్రకారం రూ.2లక్షల వరకు ఖర్చు అవుతోందిన వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలల నుంచే ఈ ధరలు - మల్చూర్, ఎస్‌ఈ

ఇతర వస్తువుల ధరలు ఏ విధంగా పెరుగుతున్నాయో, అదే మాదిరిగా విద్యుత్తు ఉపకరణాల ధరలు కూడా పెరిగాయి. మూడు నెలల క్రితం నుంచే పెంచిన ధరలు అమలవుతున్నాయి. ఇది మేము తీసుకున్న నిర్ణయం కాదు. విద్యుత్తు సంస్థ ఈ ధరలనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తోంది.

# మామిడి రైతులకు ఉపయుక్తమండి



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సత్తుపల్లి నియోజకవర్గం మామిడికాయలకు ప్రసిద్ధి. ఈప్రాంతంలో సుమారు 19 వేల ఎకరాల్లో మామిడిపంట సాగవుతోంది. వ్యాపారులే ఇక్కడికి వచ్చి మామిడికాయలను కొని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లో సుమారు 30 కొనుగోలు కేంద్రాలు(మండీలు) ఉన్నాయి. దళారుల బెడద లేకుండా నేరుగా వ్యాపారులకే రైతులు విక్రయిస్తున్నారు. ఏపీలోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా ఆరిగిపల్లి, నూజివీడు, విసన్నపేట, రెడ్డిగూడెం, పుట్రేల, తిరువూరు, ఏకొండూరు, మైలవరం నుంచి రైతులు తల్లాడ, కల్లూరు ప్రాంతాలకు తీసుకొచ్చి మామిడికాయలను అమ్ముతుంటారు. తల్లాడ, కల్లూరు మండలాల్లో రైతుల నుంచి కమీషన్ తీసుకోకుండా సరకు ఖరీదు చేస్తుండటం విశేషం. వరంగల్, సూర్యాపేట, హైదరాబాద్, ఖమ్మం మార్కెట్లలో ఏజెంట్లు 10 శాతం కమీషన్ తీసుకుంటారు.

ఇతర రాష్ట్రాలకు తరలింపు

తల్లాడ, కల్లూరు మండలాల్లోని మండీలకు మహారాష్ట్ర, పంజాబ్, ఢిల్లీ, హరియాణా, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వ్యాపారులు వచ్చి మామిడికాయలు కొని ఆయా రాష్ట్రాలకు తరలిస్తుంటారు. మార్చి మొదటివారంలో మామిడికాయల టన్ను ధర రూ.50వేల నుంచి రూ.90వేల వరకు ఉంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల మామిడికాయలు నాణ్యత కోల్పోవటంతో ప్రస్తుతం టన్ను ధర రూ.20వేల నుంచి రూ.40వేల వరకు పలుకుతోంది. బంగినపల్లి, తోతాపురి కాయలను వ్యాపారులు అధికంగా కొంటారు. ఒక్కో లారీకి 15-20 టన్నులు లోడింగ్ చేస్తారు. సత్తుపల్లి నియోజకవర్గం నుంచి రోజూ సగటున 50 లారీల సరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది.

3 వేల మంది కూలీలకు ఉపాధి

తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని ఒక్కో మండీలో 100 మంది కూలీలు పనిచేస్తున్నారు. బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కూలీలు ఫిబ్రవరిలో ఇక్కడికి వచ్చి తాత్కాలికంగా నివాసం ఏర్పర్చుకొని మే వరకు ఉంటారు. వ్యాపారులే కూలీలను తీసుకొస్తారు. కొన్న మామిడికాయలను బాక్సుల్లో పెట్టి పాడుకాకుండా, పండేందుకు ఇథలిన్, ఎన్‌రైఫ్ ఆర్గానిక్ పౌడర్‌ను ఉంచి స్టిక్కరుతో ప్యాకింగ్ చేసి లారీల్లోకి ఎక్కించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

ఐదేళ్లుగా కొంటున్నాం..పునీత్ కిల్వాని, బబ్బుభాయ్, వ్యాపారులు, రాజస్థాన్

తల్లాడ, కల్లూరు మండలాల్లోని మామిడికాయలను ఐదేళ్లుగా కొంటున్నాం. ప్రత్యేకంగా లారీల ద్వారా మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్‌కు తరలించి విక్రయిస్తుంటాం.

నచ్చిన ధరకు విక్రయించొచ్చు

షేక్ రఫీ, మండీ నిర్వాహకుడు

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా నేరుగా మండీలకు వచ్చి మామిడికాయలను నచ్చిన ధరకు విక్రయించొచ్చు. నాగపూర్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడికొచ్చి మామిడికాయలు కొంటున్నారు. మండీలు అందుబాటులో ఉండటం రైతులకు ఉపయుక్తం.

మండలాల వారీగా సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

| | |
|---|---|
| తల్లాడ | 1,793 |
| వేంసూరు | 6,539 |
| కల్లూరు | 3,499 |
| సత్తుపల్లి | 1,295 |
| పెనుబల్లి | 6,304 |

# పెరిగిన ఉపాధి వేతనం



ఖమ్మం : గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఒక కుటుంబానికి ఏడాదికి కనీస వేతనంతో కూడిన వంద రోజుల పనిని కల్పించాలని ఈ పథకం లక్ష్యం. ఈ పథకం ద్వారా పనులకు హాజరవుతున్న కూలీల వేతనాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న ఏప్రిల్ ఒకటి(శనివారం) నుంచి రోజువారీ వేతనం రూ.15 పెంచుతూ మొత్తంగా రూ.272 అందేలా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

కేంద్రం కనుసన్నల్లోనే...

ఉపాధి పనుల ఎంపిక, పని దినాల లక్ష్యాలు గతంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించేది. నిధుల వివాదం చెలరేగడంతో గత ఏడాది నుంచి ఈ పథకాన్ని కేంద్రం తన అధీనంలోకి తీసుకుంది. ఉపాధి పథకం నిర్వహణ సాఫ్ట్‌వేర్‌ను మార్చిన కేంద్ర ప్రభుత్వం జిల్లాల పనిదినాలను నిర్దేశిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో...ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 5.55 లక్షల మంది పేదలు ఉపాధి హామీ పథకం పనులకు హాజరవుతున్నారు.

కూలి రూ.272..

తెలంగాణలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు దినసరి వేతనంగా ఇప్పటి వరకు రూ.257లు అందిస్తున్నారు. కేంద్రం పెంచిన రూ.15లతో కలిపి ఇది రూ.272లకు చేరింది. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ వేతనం అమలు కానుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ పనులు లేని వేసవిలో ఉపాధి పనులకు హాజరయ్యే వారి సంఖ్య అధికంగా ఉంటుంది.

రూ.15 అధికంఎం.విద్యాచందన, డీఆర్‌డీవో

ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల రోజువారీ వేతనం రూ.15 పెరిగి రూ.272 లకు చేరింది. జాబ్ కార్డులు కలిగిన వారు వేసవిలో చేపట్టే పనులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలి.

# రామాలయ వైదిక కమిటీలో మళ్లీ రగడ...!



సత్తుపల్లి : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో పూజా విధులను దిశానిర్దేశం చేసే వైదిక కమిటీలో మరోసారి రగడ రాజుకుంది. బ్రహ్మోత్సవాలకు కొద్దిరోజుల ముందు అంతర్యుద్ధం చోటుచేసుకుంది. రెండు వర్గాలతో ఈవో రమాదేవి ప్రత్యేకంగా సమావేశమై సమన్వయం కుదిర్చారు. శ్రీరామనవమి కల్యాణం- పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకాన్ని అట్టహాసంగా నిర్వహించారు. శ్రీరామాయణ మహాక్రతువు పరమానందం కలిగించింది. ఇక ఎలాంటి వివాదాలు ఉండవని భావించినా మళ్లీ భిన్నవాదనలకు తెరలేపారు. వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనుండగా ఓ వైదిక పెద్ద.. కమిటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించడం చర్చకు దారితీసింది. తాను కమిటీలో లేకపోయినా సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన చెబుతున్నారు.పంతాలు, పట్టింపులు గతంలో ఒక స్థానాచార్యుడు, ఇద్దరు ప్రధానార్చకులు, ఒక వేదపండితుడు, ఓ పురోహితుడు వైదిక కమిటీలో కీలకంగా వ్యవహరించేవారు. పురోహితుడితో పాటు ఒక ప్రధానార్చకుడు ఉద్యోగ విరమణ చేశారు. సీనియర్ ఉప ప్రధానార్చకుడు ప్రధానార్చకుడిగా ఉద్యోగోన్నతి పొందారు. పురోహిత పోస్టును భర్తీ చేయకుండా ఇప్పటికే వైదిక కమిటీలో ఉన్న వేద పండితుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ పరిస్థితుల్లో గతేడాది సెప్టెంబరులో నూతన వైదిక కమిటీని ప్రకటించారు. ఇందులో స్థానాచార్యుడు, ఒక ప్రధానార్చకుడు, ఉప ప్రధానార్చకుడు, వేద పండితుడు, ఇన్‌ఛార్జి పురోహిత బాధ్యతలు నిర్వర్తిస్తున్న మరో వేద పండితుడు ఉన్నారు. ఐదుగురూ ఈ రంగంలో నిష్ణాతులు. వీరిపై ఎవ్వరికీ అభ్యంతరాలు లేవు. ఇక్కడ ఇద్దరు ప్రధానార్చకులు ఉన్నందున వైదిక కమిటీలో మరో ప్రధానార్చకుడికీ చోటు కల్పించాలని ఓ వర్గం పట్టుబట్టింది. ఇంకో వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలా పంతాలు, పట్టింపులు ఎక్కువయ్యాయి.

అధికారులు చొరవ తీసుకుంటేనే..

ఉత్సవాల హడావుడిలో వైదిక కమిటీ నిమగ్నమై వాటిని విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈలోగానే తాను కమిటీ నుంచి తప్పుకొంటున్నట్లు ఓ వైదిక పెద్ద ప్రకటించారు. ఇంకొక్కరు కూడా తప్పుకొంటున్నట్లు లేఖ రాసినట్లు ప్రచారం సాగుతున్నా కార్యాలయానికి చేరలేదని తెలిసింది. వైదిక కమిటీలోకి మరో ప్రధానార్చకుడిని బ్రహ్మోత్సవాల తర్వాత తీసుకునే వీలుందని భావిస్తున్నప్పటికీ ఆయన చేరతారా లేదా అన్నది సందిగ్ధంగా మారింది. త్వరలో కొంతమంది ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆ పోస్టులపై దృష్టి సారించటానికి వైదిక కమిటీ నిర్ణయమే కీలకం. అధికారులు చొరవ తీసుకొని వివాదాన్ని సద్దుమణిగించాలని భక్తులు కోరుతున్నారు.

# శత శాతం ఇంకుడు గుంతలతో ఆదర్శం

భూపాలపల్లి : ఈ తండా అభివృద్ధిలో దూసుకెళ్తుంది. అక్షరాస్యత, ఇంకుడు గుంతలు, పారిశుద్ధ్యం నిర్వహణలో ముందువరుసలో ఉంది. తండాకు చెందిన కొందరు అమెరికా, అస్టేలియ తదితర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొంత మంది ఉన్నత విద్యను చదువుతున్నారు. జన్మనిచ్చిన గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు వారంతా ముందుకు వచ్చారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రభుత్వం ప్రకటించింది. స్థానికులు సంఘటితంగా పోటీ లేకుండా సర్పంచి, వార్డు సభ్యులను ఎన్నుకుని ఆదర్శంగా నిలిచారు జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఆల్వార్‌బండ(శంకర్) తండా వాసులు.

అక్షరాస్యతకు పెద్ద పీట

తండా పెద్ద మనిషి బానోతు శంకర్‌నాయక్ తన పిల్లల చదువు కోసం స్థానికంగా పాఠశాల లేదు. దీంతో అతను ఓ ప్రైవేట్ ఉపాధ్యాయున్ని జఫర్‌గఢ్ నుంచి తీసుకొచ్చి అక్షరాలు నేర్పించాడు. ఆ పిల్లలు వృద్ధిలోకి వచ్చి ఒకరు అధ్యాపకునిగా, మరోకరు బ్యాంకు ఉద్యోగిగా ఎంపికైనారు. వీరిని ఆదర్శంగా తీసుకుని తండాకు చెందిన పలువురు తమ పిల్లలను బడికి పంపించారు. వారు ఉన్నత చదువులు



చదివి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. దాదాపుగా 125 మంది ఉద్యోగులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి

తండాలో 582 మంది జనాభా, 128 కుటుంబాలు ఉన్నాయి. చదువుకున్న యువత, ఉద్యోగులు ప్రత్యేక సమావేశమై పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాదాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. బహిర్భుమికి ఆరుబయటికి వెళితే జరిమానా విధించాలని నిబంధన పెట్టుకున్నారు. ఉపాధిహామీ పథకంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్లను మంజూరు చేశారు. వారందరూ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని మండలంలోనే శత శాతం మరుగుదొడ్లను నిర్మించుకున్న గ్రామంగా నిలిచింది. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఉందంటే ఆశ్చర్యం కలగకమానదు. శత శాతం ఇంకుడు గుంతలు నిర్మించుకున్న గ్రామంగా నిలిచింది.

సొంత ఖర్చులతో సీసీ కెమెరాలు

తండాకు చెందిన ప్రజలు ఏలా ఉన్నారు, ఊరి బాగోగులు తెలుసుకోవడానికి వీలుగా సీసీ కెమెరాలు బానోతు ప్రవీణ్‌కుమార్ తన సొంత ఖర్చులతో పది చోట్ల రూ.80వేల వ్యయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించడంతో దేశ,విదేశాల్లో ఉన్న వారంతా ప్రతి రోజు తండాలో ఏం జరుగుతుందో తెలుసుకుంటునారు. సర్పంచిగా ఎన్నికైన బానోతు తులసమ్మ తన సొంత ఖర్చులతో ప్రతి విద్యుత్తు స్తంభానికి ఎల్‌ఈడీ దీపాలు బిగించారు. ఆల్వార్‌స్వామి దేవాలయం వరకు ప్రత్యేకంగా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల ప్రజలు కుర్చోవడానికి దాతలు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. సర్పంచి కుమారులు రూ.3లక్షల సొంత డబ్బులతో ఆల్వార్‌స్వామి దేవాలయం వద్ద స్వాగత తోరణాన్ని నిర్మిస్తున్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..- బానోతు తులసమ్మ, సర్పంచి ఆల్వార్‌బండ(శంకర్‌తండా)

గతంలో రేగడితండా పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు నిధుల కొరత వల్ల అభివృద్ధి జరగలేదు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను

చదువుకోవడానికి ప్రోత్సాహిస్తున్నాం..- బానోతు వెంకట్రాంనాయక్, విశ్రాంతి ఆర్‌జేడీ

తండా నుంచి అధ్యాపకునిగా ఉద్యోగం సాధించిన తొలి వ్యక్తిని. అందరూ చదువుకోవాలని ప్రోత్సాహించాను. మంచి ఉద్యోగాల్లో పని చేస్తున్న వారు ఉన్నారు. తండా అభివృద్ధి కోసం చేయూతనిస్తున్నారు. అభివృద్ధి కోసం సంఘటితంగా పనిచేస్తున్నాం.

# ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు

జనగామ : పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునికతను అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రాథమిక పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు.. కరోనా తదితర కారణాలతో కనీస సామర్థ్యాలు సాధించలేక పోయారని గుర్తించి ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. వీలైనంత త్వరలో ఎంపిక చేసిన బడులకు వీటిని అందించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలి విడతలో.. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించి 19,800 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు వీటిని అందజేయనున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా సరఫరా చేస్తారు.

ఏం సమాచారం నిక్షిప్తం చేస్తారు? ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. రికార్డులు, విద్యార్థుల ప్రవేశ రిజిస్టర్, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం అంతా లిఖితపూర్వకంగా ఉంటూ కొంతకాలానికి కావాల్సిన సమాచారం దొరకడంలేదని ఆరోపణలున్నాయి. విద్యార్థికి వచ్చిన మార్కులు, సహపాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ తదితర విషయాలు, విద్యార్థి ప్రవేశ సంఖ్య, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ తదితర వివరాలన్నీ ఇందులో నిక్షిప్తం చేయనున్నట్లు సమాచారం. వీటి నిర్వహణ, సంరక్షణ బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిదే. ఇప్పటికే మన ఊరు మనబడి కార్యక్రమం కింద పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, బోధనలో నూతనత్వాన్ని పరిచయం చేయడంతో సమాజ విశ్వాసాన్ని పొందాయి. వచ్చే ఏడాది నుంచి ఇవి పూర్వవైభవాన్ని సంతరించుకుంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పటి వరకు ఉపాధ్యాయులు.. పాఠశాల విద్యకు సంబంధించిన సమాచారాన్ని తమ చరవాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించవచ్చు. వీటి నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులకు నిపుణులతో శిక్షణ కూడా ఇప్పించే యోచనలో ప్రభుత్వం ఉంది.

# కాలువల అనుసంధానం... సాగునీటి సద్వినియోగం

జగిత్యాల : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధి ఇందిరమ్మ వరదకాలువ నుంచి నీటిని కాకతీయ కాలువలోకి తరలించే అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తికావటంతో జలాల సద్వినియోగానికి అవకాశం ఏర్పడింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని శ్రీరాంసాగర్‌లోకి ఎత్తిపోసేలా రూ.1950 కోట్లతో చేపట్టిన పునరుజ్జీవ పథకంలోని రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజుల నిర్మాణం పూర్తయ్యింది. ముప్కల్ పంపుహౌజు పనులను పూర్తిచేసి వరదకాలువ ద్వారా ఎల్లంపల్లి జలాలను ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసే ప్రక్రియను పూర్తిచేయాల్సిఉంది. తద్వారా రోజుకు ఒక టీఎంసీ చొప్పున 60 రోజులపాటు 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఎగువనుంచి వరదరాని సందర్భాల్లోనూ ఎస్సారెస్పీనింపి సాగు, తాగునీటికి భరోసా కల్పించవచ్చు.

తగ్గనున్న ఖర్చు

ఎల్లంపల్లి నుంచి నీటిని వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోసి తిరిగి కాకతీయ గ్రావిటీ కాలువ ద్వారా దిగువకు తరలించేకన్నా మధ్యలోనే ఈ రెండు కాలువలను అనుసంధానిస్తే ఎత్తిపోతల ఖర్చు తగ్గుతుందని భావించి కాలువల అనుసంధానాన్ని చేపట్టారు. గంగాధర మండలం ర్యాలపల్లి శివారులోని వరదకాలువ 88.400 కి.మీ వద్ద లింకు కాలువను తవ్వి మల్యాల మండలం తాటిపల్లి శివారు 97.460 కి.మీ వద్ద కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా రూ.80 కోట్లతో



అనుసంధాన కాలువ తవ్వారు. అనుసంధాన కాలువ ఎలాంటి ఎత్తిపోతలేకుండా పూర్తిగా గ్రావిటీతో కూడుకున్నది కాబట్టి వరద కాలువలోని నీరు కాకతీయ కాలువలోకి చేరి డి–70 నుంచి డి–94 వరకుగల డిస్ట్రిబ్యూటర్ల పరిధిలో పంటలకు పారుతుంది. తద్వారా ఎస్సారెస్పీపై భారం తగ్గుతుంది, ధర్మపురి, చొప్పదండి, రామగుండం, మంథని, పెద్దపల్లి, కరీంనగర్ నియోజకవర్గాల్లోని 2.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించవచ్చు.

సద్వినియోగానికి చర్యలు

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో విస్తరించిన వరదకాలువలో నిండుగా నీరు నిల్వచేస్తే కాలువకు ఇరువైపులా భూగర్భ జలమట్టం పెరగటం, తూములను అమర్చి చెరువుల్లోకి జలాలను తరలించటం, కాలువకు మోటార్లను అమర్చుకొని రైతులు పంటలను సాగుచేయటం, చేపల పెంపకం తదితరాల ద్వారా అనేకరీతులుగా ప్రయోజనం కలుగుతోంది.

ఎస్సారెస్పీలోకి ఎత్తిపోతలకు, మధ్యమానేరు, దిగువమానేరు తదితర జలాశయాలకు నీటిని తరలించే ప్రధాన కాలువగా వరదకాలువ మారటంతో మిగిలిన తూముల నిర్మాణం, మేడిపల్లి, కథలాపూర్ తదితర మండలాలకు చేపట్టిన ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలకు కాలువ ఆలవాలంగా మారుతుంది. దీంతో పాటుగా రూ.62 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ఆధునికీకరణ, గోదావరినుంచి చేపట్టిన 16 ఎత్తిపోతల పథకాలు, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయటం ద్వారా పూర్తిస్థాయిలో జల అభయం కలుగుతుంది.

కాకతీయ, వరదకాలువల పరిధిలోని 80 వరకు తూముల నిర్మాణాన్ని పూర్తిచేస్తే ప్రాజెక్టు నీరుచేరి దాదాపుగా 700 వరకు గొలుసుకట్టు చెరువులు స్థిరీకరించబడతాయి. డిస్ట్రిబ్యూటరీలు, ఉపకాలువల లైనింగ్, గండ్లు పూడ్చటం, షట్టర్లు, యూటీలు, డ్రాపులు, సూపర్‌ప్యాసేజ్‌లు, అక్విడెక్టుల మరమ్మతులను పూర్తిచేయాలి.

కాకతీయ కాలువను మీటరు లోతుతీసి కట్టల బలోపేతం, కాలువకు ఇరువైపులా లైనింగ్‌చేసి నీటి తరలింపు సామర్థ్యాన్ని గతంలోలాగా 9,300 క్యూసెక్కులకు పెంచాల్సి ఉంది.

ఆక్రమణలకు గురైన ప్రాజెక్టు భూములను స్వాధీనం చేసుకోవాలి. శాశ్వత మరమ్మతులతో కాలువల చివరి గ్రామాల ఆయకట్టుకు నీరందేలా చూడాలి.

# సిబ్బంది కొరత... అద్దె భవనాలు

బోయినపల్లి : నిరుద్యోగ యువత, పుస్తక ప్రియులకు విజ్ఞానాన్ని అందిస్తున్న గ్రంథాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు గ్రంథాలయాలకు సొంత భవనాలు లేకపోవడం, సిబ్బంది కొరతతో పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిలో సమస్యల పరిష్కారానికి నిధులు అరకొరగా కేటాయిస్తున్నారు. ఫలితంగా పాఠకులకు కష్టాలు తప్పడం లేదు. జిల్లా గ్రంథాలయంతోపాటు బోయినపల్లి, కోనరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, వేములవాడ మండలాల్లో గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో జిల్లా గ్రంథాలయంతోపాటు బోయినపల్లి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, గంభీరావుపేటలోని గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉండగా మిగిలిన మండలాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వాటిలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పుస్తక పఠనం కోసం వచ్చే పాఠకులు, వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి వచ్చే నిరుద్యోగ యువతకు ఇబ్బందులు తప్పడం లేదు. పక్కా భవనాలు ఉన్నా పలు చోట్ల ప్రహరీలు లేవు. శౌచాలయాలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అత్యవసర సమయంలో పాఠకులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. స్థల సమస్య వల్ల పుస్తకాలు భద్రపరచడం సమస్యగా మారుతుంది. కోనరావుపేట, వేములవాడ, జిల్లా గ్రంథాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గ్రంథపాలకులు ఉన్నారు. చందుర్తి, ముస్తాబాద్, గంభీరావుపేటలో గ్రంథపాలకుడు లేకపోవడంతో ముస్తాబాద్, గంభీరావుపేటల్లో వాచ్‌మెన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంటలో తాత్కాలిక సిబ్బంది, చందుర్తిలో అటెండర్‌తో కాలం వెల్లదీస్తున్నారు. ఇటీవల వేములవాడలో భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడంతోపాటు మిగిలిన మండలాల్లో సొంత భవనాల నిర్మాణాలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు. ఎల్లారెడ్డిపేటలో రూ.12 లక్షలతో ప్రహరీ, బోరు, శౌచాలయాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. బోయినపల్లిలో సదుపాయాల కోసం రూ.10 లక్షలు కేటాయించారు. గ్రంథపాలకులు, అటెండర్‌లను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించడానికి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాలు వస్తే నియామకాలు చేపట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

# ధరణి స్లాట్ల రద్దు సొమ్ము జమయ్యేనా?




జనగామ : పంటలు పండించేందుకు నిరంతరం శ్రమించే రైతన్నకు అడుగడుగునా కష్టాలు, సమస్యలు తప్పడం లేదు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకొని.. అనివార్య కారణాలతో రద్దు చేసుకున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆ సొమ్మును తిరిగి జమ చేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో పలువురు రైతుల ఖాతాల్లో ఆ సొమ్మును జమ చేయడం లేదు. అన్నదాతలు డబ్బుల కోసం మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారు ముందుగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించారు. మార్కెట్ విలువ ప్రకారం భూముల విస్తీర్ణానికి అనుగుణంగా రుసుము చెల్లించారు. వివరాల్లో పొరపాట్లు ఉండడం, ధర విషయంలో చివరి నిమిషంలో ఇరువర్గాల వారు నిర్ణయాలను మార్చుకోవడం తదితర కారణాలతో పలువురు రైతులు స్లాట్లను రద్దు చేసుకుంటున్నారు. ధరణిలో పేరు, చిరునామాను మాత్రమే సవరించుకునే అవకాశం ఉంది. మిగతా అంశాల్లో ఏవైనా తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం లేకపోవడం సైతం స్లాట్ల రద్దుకు కారణమవుతోంది. జిల్లాలో సుమారు 250 మంది రైతులు ఇలా స్లాట్లను రద్దు చేసుకొని సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమంది లక్షల్లో చెల్లించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో... జిల్లాలోని కొన్ని మండలాల్లో రైతులు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకుల వద్ద ధరణి స్లాట్లను నమోదు చేసుకుంటున్నారు. రద్దు చేసుకున్న అనంతరం చాలా మంది రైతులు తమ సొమ్ము కోసం అంతర్జాల కేంద్రాల నిర్వాహకుల ఖాతాలనే ఇస్తున్నారు. అన్నదాతల చరవాణి నంబర్లకు ఓటీపీ వస్తుందని అధికారులు చెబుతుండగా.. ఎవరికీ ఓటీపీ రావడం లేదని, మూడేళ్ల నుంచి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని బాధితులు వాపోతున్నారు.

త్వరగా ఇప్పించాలి.. –పారుపల్లి పరమేశ్వర్, ఆలీంపూర్, బచ్చన్నపేట మండలం

మా నానమ్మకు చెందిన భూమిని వారసత్వంగా పొందేందుకు నేను, మా కుటుంబ సభ్యులు స్లాట్ నమోదు చేశాం. మొత్తం రూ.9750 చెల్లించాం. కోర్టు కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ కాలేదు. ఆన్‌లైన్ సెంటర్‌లో స్లాట్‌ను రద్దు చేసుకున్నాం. మూడు నెలలవుతున్నా సొమ్ము జమ కాలేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం ..– అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

ధరణి పోర్టల్‌లో రైతులు రద్దు చేసుకున్న స్లాట్లకు సంబంధించి సొమ్ము చెల్లింపు విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. మార్కెట్ విలువ ప్రకారం వారు చెల్లించిన డబ్బుల వివరాల, బ్యాంకు ఖాతాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

# బియ్యం మిల్లులు.. కాలుష్య కాసారాలు



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లాలోని బియ్యం మిల్లులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. పరిసరాలను కలుషితం చేస్తూ యథేచ్ఛగా వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు కనీసం తనిఖీ చేసిన పాపాన పోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా మిల్లుల నిర్వహణతో చుట్టుపక్కల ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. కాలం చెల్లిన యంత్రాలు వెదజల్లే పొగతో కార్బన్ డై ఆక్సైడ్ మోతాదు ఎక్కువై సమీప పంట పొలాల్లోకి పొగ, ధూళి చేరుతోంది.

వాతావరణంలో కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న మిల్లులపై సుల్తానాబాద్, పెద్దపల్లి ప్రాంతాల నుంచి అధికారులకు పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోని మిల్లులు కూడా నిబంధనలు పాటించడం లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 300 బియ్యం మిల్లులుండగా 80 శాతం కాలుష్యాన్ని వెదజల్లుతున్నట్లు కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యానికి కారణమవుతున్న 190 బాయిల్డ్, 70 రా రైస్ మిల్లుల యజమాన్యాలకు సంస్థ నోటీసులు జారీ చేసింది. అయితే ఈ నోటీసులకు ఎవరూ స్పందించడం లేదని, అనుమతుల పునరుద్ధరణకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

పెద్దపల్లి నూతన కలెక్టరేట్ భవనం సమీపంలో ఉన్న 8 మిల్లులకు గతంలో పీసీబీ నోటీసులు ఇచ్చింది. వెంటనే పొగ, ఊక ధూళి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ ఫలితం లేదు. దీంతో ఇప్పటికీ ఇక్కడి మొక్కలు, కార్యాలయాలు, వాహనాలను ధూళి కమ్మేస్తోంది.

పంటల ఎదుగుదలకు ప్రతిబంధకం

మిల్లర్లు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులుగా వ్యవహరిస్తూ పర్యావరణ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. అధికారులు తనిఖీ చేసేందుకు వస్తే పైరవీలు, ఒత్తిళ్లు చేయిస్తూ తప్పించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బియ్యం మిల్లుల సంక్షేమ సంఘాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పెద్దపల్లిలో ఏకంగా 3 సంఘాలుండగా ఇటీవలే స్థానిక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఉండే అడ్‌హక్ కమిటీ రైస్‌మిల్ సంఘం ఏర్పాటు చేయడం గమనార్హం. పార్టీల వారీగా మిల్లర్లు విడిపోవడంతో అధికారుల తనిఖీలకు సహకరించడం లేదు. మిల్లుల నుంచి వెలువడే ధాన్యపు పొట్టు బయటకు రాకుండా, రహదారులపై పడకుండా ప్రత్యేకంగా కవర్లను, సంచులను ఏర్పాటు చేయాలి. ఈ జాగ్రత్తలను 40 శాతం మిల్లులు మాత్రమే పాటిస్తున్నాయి. గాలిలో ధూళి, దుమ్ము చేరకుండా నాణ్యమైన యంత్రాలను ఉపయోగించాలి. 30 శాతం మిల్లుల్లో కాలం చెల్లిన యంత్రాలనే వాడుతున్నారు. మిల్లుల్లో పనులు జరుగుతున్నపుడు పక్కనున్న రోడ్డుపై వెళ్లే వాహనదారుల కళ్లలో ధూళి చేరి అనారోగ్యాలకు కారణమవుతోంది. ఊక, తవుడు వ్యర్థాలు సమీప పొలాల్లో పేరుకుపోయి పంటల ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారుతున్నాయి. మిల్లులను గతంలో పొలాల పక్కనే ఏర్పాటు చేయడంతో బియ్యం ఉడికించిన నీరు, ఇతర వ్యర్థాలు వరి, పత్తి పంటల్లోకి చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

మిల్లుల చుట్టూ 10 మీటర్ల వెడల్పుతో 'గ్రీన్‌బెల్ట్'ను అభివృద్ధి చేస్తూ మొక్కలు నాటి పర్యవేక్షించాలి. జిల్లాలోని ఒక్క మిల్లులోనూ దీన్ని పాటించడం లేదు. ధాన్యం వండుతున్న క్రమంలో మిల్లుల నుంచి వెలువడే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలకు, కాలువల్లోకి వదలొద్దు. ఇందుకోసం మిల్లుల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకోవాలి. 90 శాతం మిల్లులకు ఈ వ్యవస్థ లేదు. బాయిలర్ నుంచి వచ్చే బూడిదను నిల్వ చేయడానికి మూసి ఉండే షెడ్లు ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటీ ఎవరూ సరిగ్గా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిల్లుల్లో వెలువడే పొగ మూలంగా సమీప ఇళ్లలో ఉండే గృహిణులు, వృద్ధులు ఎక్కువగా శ్వాసకోశ సంబంధ, నేత్ర సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం : –భిక్షపతి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ, రామగుండం

బియ్యం మిల్లులు కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే. గతేడాది అప్పటి అధికారి నోటీసులిచ్చినప్పటికీ వారు స్పందించలేదు. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగితే మాకు ఫిర్యాదు చేయాలి. షోకాజ్ నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం.

# అందని ఏకరూప దుస్తులు

మల్యాల : విద్యాసంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఏకరూప దుస్తులు అందలేదు. మల్యాల మండలంలోని 19 గ్రామాల పరిధిలో 11 జడ్పీ ఉన్నత, 25 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. వీటికితోడు బాలికల గురుకుల, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల ఏకరూపదుస్తులు కుట్టించి ఇవ్వడానికి ప్రభుత్వం ఐదు నెలల క్రితమే వస్త్రాన్ని సరఫరా చేసింది. అయినప్పటికీ దుస్తులు కుట్టడానికి దర్జీలు ముందుకు రాకపోవడంతో తీవ్ర జాప్యం జరిగింది.

మండలంలో 1 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు 2,928 మంది, 9,10 తరగతులు చదివే విద్యార్థులు 691 మంది ఉన్నారు. ఆదర్శ, గురుకుల పాఠశాలల్లో మరో 391 మంది విద్యార్థులున్నారు. వీరిలో 1నుంచి 8వ తరగతి విద్యార్థులకు(బాలురు) రెండు జతల నెక్కర్లు, చొక్కాలు, 9,10 తరగతి చదివేవారికి ప్యాంటు, చొక్కాలు కుట్టించడానికి అవసరమైన (ప్యాంట్లకు) 3,203 మీటర్లు, చొక్కాలకు 5,511 మీటర్ల వస్త్రాన్ని, బాలికలకు చున్నీల కోసం మరో 1155 మీటర్ల వస్త్రాన్ని మండల విద్యాధికారి కార్యాలయానికి సరఫరా చేశారు. చొక్కా, ప్యాంటు లేదా చొక్కా, నిక్కరు కుట్టడానికి దర్జీ ఛార్జీల కోసం ప్రభుత్వం రూ.50లు మాత్రమే మంజూరు చేయడంతో విద్యార్థుల దుస్తులు కుట్టడానికి కూలీ గిట్టుబాటు కాదన్న కారణంతో దర్జీలు ముందుకు రాలేదు. కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారుల చొరవతో ఇటీవలే ఒక్కో విద్యార్థికి ఒక జత దుస్తులు కుట్టించి అందజేశారు.

# బాలికల ఆరోగ్యానికి భద్రత కరవు

పెద్దపల్లి : కన్నవారి ప్రేమకు దూరమైన అనాథలు.. నిరుపేద కుటుంబానికి చెందిన బాలికలు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న సమున్నత లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశం కల్పిస్తూ ఉచిత వసతి, భోజనం, ఏకరూపదుస్తులు, కార్పొరేట్ స్థాయిలో బోధన అందిస్తున్నాయి. క్రమశిక్షణతో కూడిన చదువుతో బాలికలు తమ భవితకు బంగారు బాటలు వేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం నుంచి కాస్మోటిక్ ఛార్జీల మంజూరు నిలిచిపోయింది. గతంలో ప్రతి విద్యార్థినికి నెలకు రూ.100 చొప్పున మంజూరయ్యేవి. అయిదేళ్ల కిందట నగదు పంపిణీ నిలిపివేసి నాలుగు నెలలకోసారి ఆరోగ్య కిట్‌ను అందజేస్తున్నారు. కాగా 2020లో కొవిడ్ నేపథ్యంలో మూడేళ్లుగా కిట్ల పంపిణీ కూడా నిలిచిపోయింది.

16 రకాల సామగ్రితో కిట్లు



కస్తూర్బా పాఠశాలల్లో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన బాలికలే చదువుకుంటున్నారు. గతంలో పదో తరగతి వరకు బోధించగా కొంతకాలంగా జూనియర్ కళాశాల స్థాయికి ఉన్నతీకరిస్తున్నారు. చదువుతో పాటు బాలికల సంపూర్ణ ఆరోగ్య వికాసం కోసం ఆరోగ్య కిట్లను సరఫరా చేశారు. ఇందులో సబ్బులు, షాంపూ, దువ్వెన, పిన్నులు, కొబ్బరి నూనె, టికిలీలు, టూత్‌పేస్టు, పౌడర్, శానిటరీ న్యాప్కిన్లు తదితర 16 రకాల సామగ్రి ఉంటుంది. నాలుగు నెలలకు సరిపడా కాస్మోటిక్ సామగ్రి సమకూరడంతో బాలికలకు ఆర్థిక భరోసానిచ్చింది.

నగదుపై కసరత్తు

ఆరోగ్య కిట్ల స్థానంలో తిరిగి కాస్మోటిక్ ఛార్జీలను పంపిణీ చేయాలని మౌఖిక ఆదేశాలు వచ్చాయి. నగదు విడుదలలో అక్రమాలకు తావు లేకుండా బాలికలతో వ్యక్తిగత బ్యాంకు ఖాతా తెరిపించాలని ప్రత్యేక అధికారిణులకు ఆదేశాలు అందాయి. చాలా మందికి ఖాతా లేదు. వారితో తెరిపించడానికి ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు తిరిగి పంపించడం లేదు. దీంతో పాఠాలు నష్టపోతున్నారు. ఖాతా తెరిచిన వారు ప్రభుత్వం అందజేసే ఛార్జీలకు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్వాకంతో బాలికలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు గడిచిన మూడేళ్లకు సంబంధించి కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇస్తారా? ఈ ఏడాదికి సంబంధించినవే మంజూరు చేస్తారా? అనే విషయమై స్పష్టత లేదు.

విద్యాశాఖ ఉదాసీనత

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించి, ఆర్థిక సమస్యను తొలగించేందుకు చేపట్టిన ఆరోగ్య కిట్ల పంపిణీ మూడేళ్లుగా నిలిచిపోయింది. 2020లో కొవిడ్ కారణంగా పాఠశాలలు తెరచుకోలేదు. వైరస్ ప్రభావం తగ్గడంతో గతేడాది సెప్టెంబరు నుంచి ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే కిట్ల అందజేతపై విద్యాశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 49 కస్తూర్బా పాఠశాలల్లో 10,767 మంది బాలికలు చదువుతున్నారు. ఎక్కువ మంది నిరుపేదలు, అనాథలే కావడంతో సామగ్రి కొనుగోలు ఆర్థిక భారంగా మారింది.

# రహదారులు ధ్వంసం.. ప్రయాణం నరకం

గంగాధర : చొప్పదండి నియోజకవర్గంలో గ్రామాల రహదారులు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిని నెలలు గడిచినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. ఫలితంగా వాహనదారులు ప్రమాదం అంచున వెళుతున్నారు. గ్రానైట్ లారీలు, టిప్పర్లు, ఇతర భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుండగా అడుగడుగునా గుంతలు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రహదారులను ఓసారి పరిశీలిస్తే.

ఏళ్లుగా మరమ్మతులు కరవు

గంగాధర మండల కేంద్రం నుంచి రామడుగు మండలం షానగర్ వెళ్లే రహదారి ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా ఈ దారి పూర్తిగా ధ్వంసమై గుంతలతో ప్రమాదకరంగా మారింది. గంగాధర ఊరు చివర లోలెవల్ వంతెన ప్రమాదాలు ఆహ్వానిస్తుండగా పలుచోట్ల రోడ్ల పక్కన గుంతలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. రాత్రిపూట గుంతల్లో వాహనం దిగబడితే ఆసుపత్రి పాలవ్వాల్సిందే. ఇక రామడుగు మండల కేంద్రంలో నిర్మాణం చేసిన సీసీ రోడ్డు కూడా పూర్తిగా శిథిలమై వాహనాలు వెళ్లిన ప్రతిసారి విపరీతంగా దుమ్ము లేస్తుందని స్థానికులు వాపోతున్నారు. రామడుగు మండల కేంద్రం నుంచి చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారి కి.మీ పొడవునా అసంపూర్తిగా వదిలేశారు. వాహనాలు వెళ్లినప్పుడు విపరీతంగా దుమ్ము పైకిలేస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల రహదారికిరువైపులా వర్షాలకు గొయ్యిలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. బూర్గుపల్లి నుంచి రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కూడా శిథిలమై ఏళ్లు గడిచినా మరమ్మతులు చేపట్టడం లేదు. సర్పంచి సత్యప్రసన్న గుంతల్లో మట్టి పోసి పూడ్చివేయగా ముప్పిడిపల్లి, మద్రిగడ్డ, పెండలోనిపల్లి, తిర్మలాపూర్, సర్వారెడ్డిపల్లి, బూర్గుపల్లి గ్రామాల వద్ద రహదారి పూర్తిగా శిథిలమైపోయింది. బూర్గుపల్లి–ర్యాలపల్లి రహదారి కూడా మరమ్మతులకు నోచుకోక ప్రయాణం భారంగా సాగుతోంది. కురిక్యాల నుంచి ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగారావుపల్లి గ్రామాల మీదుగా గర్శకుర్తి రోడ్డు అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారింది. గంగాధర రైల్వే లైన్ కింద రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనాల రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. నారాయణపూర్ రోడ్డు వర్షాలకు తెగిపోగా మరమ్మతులు నత్తనడకన చేస్తున్నారు. కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాల్లోనూ పలు గ్రామాల రోడ్లు శిథిలమయ్యాయి. సంబంధిత అధికారులు నిధులు మంజూరు చేసి శిథిలమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



## బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సీఎం వైయస్ జగన్ నివాళులు

తాడేపల్లి: స్వాతంత్ర్యోద్యమ నేత, సంస్కరణవాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నివాళులర్పించారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో సీఎం వైయస్ జగన్ బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్. జవహర్ రెడ్డి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

## జగన్ పార్టీ అధికారంలో ఉండేది ఇక 8 మాసాలే...




విశాఖపట్నం: జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి పట్టిన శని అని, ఒక సైకో ఏపీకి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చాన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పార్టీ అధికారంలో ఉండేది ఇక 8 మాసాలేనని అన్నారు. 2014 ఎన్నికల్లో జగన్ ప్రజలకు ఆశలు కల్పించి మోసం చేశారని విమర్శించారు. ఏపీలో టీడీపీ లేకుండా చేయాలని ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదని.. కానీ ధైర్యంగా నిలబడ్డామని... దేనికీ లొంగలేదని అన్నారు. వైసీపీలా టీడీపీ గాలికి పుట్టిన పార్టీకాదని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 160 స్థానాలు గెలుచుకోవడం ఖాయమని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీని గాడిలో పెట్టగలిగే బాధ్యత టీడీపీ తీసుకుంటుందన్నారు. 'బటన్ నొక్కడానికే ఉన్నాను... మీరు కష్టపడండి' అని సిగ్గులేకుండా జగన్ చెబుతున్నారని మండిపడ్డారు. సంపదను సృష్టించి పేదలకు పంచాలని.. కేవలం బటన్ నొక్కడం గొప్పతనం కాదన్నారు.

ఐదు కోట్ల మంది ఆంధ్రులు సైకో పాలన పోవాలని కోరుకుంటున్నారని.. జగన్ పిల్లికంటే హీనంగా మారారని.. ఎమ్మెల్యేలను బతిమాలుకుంటున్నారని.. అదే మన మొదటి విజయమని అచ్చెన్నాయుడు అన్నారు. పులివెందులలో కూడా టీడీపీ జెండా ఎగరవేసిందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు విశాఖ రాజధానిగా కోరుకోవడం లేదని.. వెనుకబాటు తనాన్ని దూరం చేయాలని కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు మరింత భాధ్యతను పెంచిందన్నారు. గతంలో అభివృద్ధి మీదే దృష్టి పెట్టి పార్టీ నేతలను పట్టించు కాలేదని.. ఈసారి కష్టపడిన వారికి గుర్తింపు ఉ ంటుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 'జగన్ సూక్తులు బాగా చెప్పారు'



గుంటూరు: ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సూక్తులు బాగా చెప్పారని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం దోపిడి విధానాన్ని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య కొనసాగిస్తున్నారని అన్నారు. ఇక్కడ ఉన్న నాయకుడు అధికారాన్ని స్వార్థానికి ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కిలారి 14, 15 ఫైనాన్స్ కమీషన్ నిధులను కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. కిలారి ప్రజా సొమ్ముల దోపిడీలో చాలా బిజీగా ఉన్నారని యెద్దేవా చేశారు. కాంట్రాక్టు అంచనాలు పెంచి కిలారి నిధులను దోచుకుంటున్నారన్నారు. ప్రజల అవసరాలు కంటే తన స్వప్రయోజనాల కోసం నిధులు దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరాచకానికి ప్రతి రూపం పొన్నూరు మునిసిపల్ కమిషనర్ అని వ్యాఖ్యలు చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రాంతానికి అధికారులను పంపి బెదిరించి లంచాలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని ధూళిపాళ్ల నరేంద్ర స్పష్టం చేశారు.

## పోలవరం కోసం ఎంతోమంది భూములు త్యాగం చేశారు...




విజయవాడ: పోలవరం కోసం ఎంతోమంది తమ భూములను త్యాగం చేశారని, నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తాను వెళ్లిన సమయంలో అక్కడ ప్రజలు ధర్నా చేస్తున్నారని, వాళ్ల ఇబ్బందులు తెలుసుకుని వారికి డబ్బులు ఇచ్చామన్నారు. రెండోసారి కూడా చంద్రబాబు రూ. 130 కోట్లు ఇచ్చారని, వారికి పక్కా ఇళ్లు కట్టించేలా చర్యలు చేపట్టామన్నారు. డయా ఫ్రం వాల్ కోసం 300 అడుగులు కిందకి వెళ్లామని తెలిపారు. ముంపు గ్రామాల ప్రజల సహకారం వల్లే తాము పురోగతి సాధించామని దేవినేని ఉమ అన్నారు. దేశంలో16 జాతీయ ప్రాజెక్టులు కేంద్రం పరిధిలో జరుగుతున్నాయని, పోలవరం స్థాయిలో ఏ ప్రాజెక్టు పనులు జరగలేదన్నారు. 13వేల 260 కోట్ల రూపాయలు పోలవరం కోసం చంద్రబాబు తెచ్చారని, చేసిన పనులకు డబ్బులు ఇవ్వమంటే ఇరిగేషన్ కాంపోనెంట్ అనే పదం ప్రస్తావించారన్నారు. మూడు వేలకోట్లు వెనక్కి ఇవ్వడానికి లక్ష డాక్యుమెంట్లు అడిగారని, ఆనాడు పది అంతస్తులు ఎక్కి ఆ మొత్తం ఇచ్చామని చెప్పారు. అన్నీ పరిశీలించిన తర్వాత కేంద్ర జల వనరుల శాఖ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ. 55,540 కోట్లకు ఆమోదం తెలిపిందన్నారు.

## మంత్రి బుగ్గనకు చేదు అనుభవం



డోన్: నంద్యాల జిల్లా డోన్‌లో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ఆయన మాట్లాడుతుండగానే మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆసరా చెక్కుల పంపిణీ కోసం డోన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పెద్ద ఎత్తున మహిళల్ని తరలించారు. ఎండ బాగా ఉ ండటం, కూర్చోవడానికి కుర్చీలు సహా కనీస సౌకర్యాలు లేకపోవడంతో మహిళలు ఇబ్బందిపడ్డారు. అధికారులు ఎంత చెప్పినా వినకుండా.. మంత్రి మాట్లాడుతుండగానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.



డా.బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఏపీ ఉపముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, మంత్రి ఆర్కే రోజా, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డిలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




## ఎన్నికల వేళ బీజేపీకి ఊహించని మద్దతు.. కమలనాథుల్లో ఊపు..

బెంగళూరు: కర్ణాటక శాసన సభ ఎన్నిక వేళ భారతీయ జనతా పార్టీకి గట్టి మద్దతు లభించింది. కన్నడనాట సినీ నటుడిగా అభిమానుల్లో క్రేజ్ సంపాదించుకున్న కిచ్చా సుదీప్ కమలం పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తానని ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి బస్వరాజ్ బొమ్మైతో కలిసి బెంగళూరులో విలేకరుల సమావేశంలో పాల్గొన్న సుదీప్ బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు.

బొమ్మైతో తనకున్న అనుబంధంతోటే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. తాను రాజకీయాల్లోకి రాబోవడం లేదని, కేవలం బీజేపీకి మద్దతు ప్రకటించి ప్రచారం చేయడానికే వచ్చానన్నారు. బీజేపీ సిద్ధాంతం తనకు నచ్చుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి బస్వరాజ్ బొమ్మై మాట్లాడుతూ నటుడు కిచ్చా సుదీప్ మద్దతు తమకు మరింత శక్తినిస్తుందని చెప్పారు. పూర్తి మెజార్టీతో తాము మరోసారి అధికారంలోకి రాబోతున్నామని చెప్పారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కారుకు ప్రజలు బీజేపీకే పట్టం కడతారని బొమ్మై ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన తనకు, బీజేపీకి మద్దతిచ్చిన కిచ్చా సుదీప్‌కు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలన్నీ జోరుగా ప్రచారం సాగిస్తున్న వేళ కిచ్చా సుదీప్ తమకు మద్దతు ప్రకటించడం కలిసి వస్తుందని ఇతర బీజేపీ నేతలు కూడా ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలవరం ముంపుపై 10న కీలక భేటీ



అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ (వెనుక జలాలు) ముంపుపై మూడు రాష్ట్రాల సందేహాలను నివృత్తి చేసేందుకు ఈనెల 10న కేంద్రం మరో కీలక సమావేశం నిర్వహిస్తోంది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ నేతృత్వంలో ఢిల్లీలో జరిగే ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల జలవనరుల శాఖల ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో హాజరుకావాలని కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదే రోజు (ఈనెల 10న) హైదరాబాద్‌లో ఏపీ, తెలంగాణ అధికారులతో నిర్వహించాల్సిన భేటీని పీపీఏ సీఈవో శివ్‌నంద్‌కుమార్ రద్దు చేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల తమ రాష్ట్రాల్లో ముంపు సమస్య ఉత్పన్నమవుతోందని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ (స్పెషల్ లీవ్ పిటిషన్) దాఖలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే నాలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు మరోసారి భేటీ అవుతున్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఇచ్చే నివేదిక ఆధారంగా నాలుగు రాష్ట్రాల సీఎంలతో మంత్రి సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.

## చంద్రబాబును కలిసిన విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు




విశాఖ: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ను విశాఖ ఎయిర్ పోర్టులో ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు కలిసారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని చంద్రబాబు చెప్పారన్నారు. కానీ జగన్ సర్కారు పూర్తిగా విఫలం అయిందని.. ఈ సమస్యను ఢిల్లీ వరకు తీసుకెళ్తానని చెప్పారన్నారు. గత కొన్ని ఏళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా.. కేంద్రం, జగన్ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. అందుకే చంద్రబాబుని కలిశామని చెప్పారు. కార్మిక సంఘాల నేతలను ఢిల్లీకి తీసుకు వెళతామని చెప్పి వైసీపీ నేతలు మాట తప్పారని, కనీసం అఖిల పక్షం నేతలనైనా సీఎం జగన్ ఢిల్లీకి తీసుకువెళ్ళాలని... ప్రైవేటీకరణను ఆపాలని.. లేదంటే ప్రజలు విశ్వసించరని కమిటీ నేతలు పేర్కొన్నారు. కాగా బుధవారం తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల క్లస్టర్ సమావేశం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

## పవన్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడంటూ మంత్రి సంచలన వ్యాఖ్యలు



ప్రకాశం : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి ఆదిమూలపు సురేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ నిలకడ లేని మనిషి అని.. రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడన్నారు. ఒక వైపు బీజేపీతో అంటకాగుతూ మరో వైపు టీడీపీ ముసుగులో పని చేస్తున్నాడన్నారు. పవన్ కల్యాణ్ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నాడో... ఎవరితో పొత్తు పెట్టుకుంటున్నాడో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. 175 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు నిలబడి చేసిన సంక్షేమ పథకాల గురించి చెబుతామన్నారు. టీడీపీ నాయకులు వాపుని చూసి బలుపని అనుకుంటున్నారని ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. టీడీపీతో టచ్‌లో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరో చెప్పాలన్నారు. 175 నియోజక వర్గాల్లో టీడీపీకి అభ్యర్థులు లేరని అందుకే పొత్తులకు వెళ్తున్నారన్నారు. ముందస్తు ఎన్నికలు లేవని సీఎం జగన్ స్పష్టత ఇచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చేసిన సీమెన్స్ స్కామ్ బయటపడిందన్నారు. 300 కోట్లు సీమెన్స్ స్కామ్ జరిగిందన్నారు. సీమెన్స్ స్కామ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి సురేష్ పేర్కొన్నారు.

## అలా కలిసిన వారందరితో పొత్తు కాదు..



విజయవాడ : జనసేన, బీజేపీ పొత్తుపై ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జనసేన, బీజేపీ కలిసే ఉన్నాయని.. కలిసే ముందుకు వెళతామన్నారు. ఈ ప్రభుత్వంపై ఇద్దరం కలిసే పోరాడతామన్నారు. కలిసి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భవిష్యత్తులో కూడా జనసేన, బీజేపీ కలిసే ప్రయాణం చేస్తుందని సోము వీర్రాజు పేర్కొన్నారు. రాజకీయ అవసరాల కోసం సహజంగా అనేక పార్టీ నేతలను కలుస్తామని.. గతంలో చంద్రబాబును కూడా రాష్ట్రపతికి మద్దతు ఇచ్చిన సమయంలో కలిశామని.. అలా కలిసిన వారందరితో పొత్తు ఉన్నట్లు కాదని సోము వీర్రాజు తెలిపారు. అయితే పవన్ కళ్యాణ్ తమ పార్టీ పెద్దలను కలిసి మాట్లాడారంటే తమ బంధం ఎంత బలమైనదో తెలుసుకోవాలని సోము వీర్రాజు పేర్కొన్నారు. తామిద్దరం కలిసి వైసీపీ ప్రభుత్వం మీద ఉద్యమిస్తామని వెల్లడించారు. ఇందులో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. రాజకీయాల్లో కొన్ని రచనలు జరుగుతాయన్నారు. నాయకులు ఏది మాట్లాడినా ఒక వ్యూహంతో మాట్లాడతారన్నారు. మా సత్యకుమార్, ఇతర నేతలపై దాడి అందరూ చూశారన్నారు. తమ పార్టీ అధిష్టానం కూడా ఈ విషయంలో సీరియస్‌గా ఉందని సోము వీర్రాజు వెల్లడించారు.

# అవ్నీత్ కౌర్.. పర్ఫెక్ట్ బోల్డ్ అటెంప్ట్..!

బాలీవుడ్ మోడల్ కమ్ యాక్ట్రెస్ అవ్నీత్ కౌర్ మామూలుగానే తన ఫోటో షూట్స్ తో ఓ రేంజ్ లో రెచ్చిపోతుంది. బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోస్ తో తనకంటూ ఒక సెపరేట్ బ్రాండ్ ఏర్పరచుకున్న అవ్నీత్ కౌర్ హిందీ ఆల్బంస్ కి ఆమె ఓ సూపర్ స్టార్ గా మారింది. ప్రత్యేకంగా ఆమె చేస్తున్న మ్యూజిక్ వీడియోస్ కి స్పెషల్ ఫ్యాన్స్ ఉన్నారు. చేసేది మ్యూజిక్ వీడియోస్ లానే అనిపించినా ఓ చిన్నపాటి సినిమా సెటప్ ఉంటుంది. అందుకే అమ్మడు వాటితోనే సూపర్ పాపులర్ అయ్యింది. అవ్నీత్ కౌర్ గ్లామర్ ట్రీట్ కి బీ టౌన్ ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. లేటెస్ట్ గా అవీత్ కౌర్ తన క్రేజీ ఫోటో షూట్స్ తో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. స్లీవ్ లెస్ జాకెట్.. షార్ట్ తో



అమ్మడు రచ్చ అంతా ఇంతా కాదు. కేవలం మ్యూజిక్ వీడియోస్ మాత్రమే కాదు అవ్నీత్ సినిమాలు టీవీ షోస్ లో కూడా నటించింది. తన గ్లామర్ తో బీ టౌన్ ఆడియన్స్ ని తన మాయలో పడేయాలని చూస్తున్న అవ్నీత్ తన దాకా వచ్చిన ఏ ఛాన్స్ ని కూడా వదలట్లేదు. మ్యూజిక్ వీడియోస్ కి ఆమె ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. వీడియో సాంగ్స్ తో స్టార్ క్రేజ్ తెచ్చుకున్న వారిలో అవ్నీత్ కౌర్ ఉంటుంది. ఛాన్స్ దొరికితే చాలు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో కుర్రాళ్ల హృదయాల్లో గిలిగింతలు పెట్టేస్తుంది అవ్నీత్ కౌర్. ఫోటో షూట్ లో బోల్డ్ షో చేస్తూ మైండ్ బ్లాక్ అయ్యేలా చేస్తున్న అమ్మడి అందాలకు ఫిదా అవ్వని వారెవరైనా ఉంటారా చెప్పండి. తనకు వచ్చిన ఈ పాపులారిటీని ప్రతి నిమిషం ఎంజాయ్ చేస్తూ తన క్రేజ్ ని మరింతగా పెంచుకోవాలని తెగ కష్టపడుతుంది అవ్నీత్ కౌర్. అయితే లేటెస్ట్ ఫోటోలైతే మాత్రం ఓ రేంజ్ లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా షార్ట్ ధరించిన అమ్మడి థైస్ షోస్ చూసి అందరు ముక్కున వేలేసుకుంటున్నారు. తన ఇన్ స్టాగ్రాం లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ రేంజ్ లో 32.8 మిలియన్ ఫాలోవర్స్ తో హంగామా చేస్తుంది అవ్నీత్ కౌర్. ఆమె స్టార్ స్టేటస్ ఏంటన్నది చెప్పడానికి ఈ ఫాలోవర్స్ ఒక ఎక్సాంపుల్ అని చెప్పొచ్చు. అవ్నీత్ ప్రస్తుతం మరో మ్యూజిక్ వీడియో చేస్తుంది. లేటెస్ట్ ఫోటో షూట్ కూడా అదేదో పబ్ బ్యాక్ డ్రాప్ ఉన్నట్టుగ ఔంది. అందుకే కలర్ ఫుల్ లైట్స్ తో కలర్ ఫుల్ గా కనిపించింది అమ్మడు. ఏది ఏమైనా అవ్నీత్ అందాల తాకిడికి బీ టౌన్ ప్రేక్షకులు పిచ్చోళ్లవుతున్నారంటే నమ్మాల్సిందే.

# బంతాటాడేసిన అమ్మడు..!

బాలీవుడ్ బోల్డ్ హీరోయిన్ ఊర్వశి రౌతెలా అంటే అక్కడ ఆడియన్స్ కి విపరీతమైన క్రేజ్. హీరోయిన్ గా కన్నా అమ్మడు స్పెషల్ సాంగ్స్ తో హిందీ ఆడియన్స్ లో పాపులారిటీ తెచ్చుకుంది. గ్లామర్ షోతో కుర్రాళ్లని అలరిస్తూ వస్తున్న ఊర్వశి నిత్యం వార్తల్లో కూడా ఉంటుంది. ఏదో ఒక విషయంలో ఆమె రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తుంది. రీసెంట్ గా ఇండియన్ క్రికెటర్ రిషబ్ పంత్ తో ఆమె గొడవ అందరికి తెలిసిందే. ఒకప్పుడు ఇద్దరు చాలా క్లోజ్ గా ఉండగా ఎవరి దారి వారు చూసుకున్నాక గొడవలు మొదలయ్యాయి. రిషబ్ ని టీజ్ చేస్తూ ఆమె హ్యాట్యాగ్ ఆర్పీ (#%RP%) అంటూ పెట్టిన కామెంట్స్ వారిద్దరి మధ్య మరింత గొడవలకు దారి తీసింది. #%RP% అని పెట్టి తన కోసం గంటల కోసం వెయిట్ చేశాడని చెప్పిన ఊర్వశి కామెంట్స్ కి ఉడికిపోయాడు రిషబ్ పంత్. ఇక్కడ ఆమె అంటున్న హ్యాట్యాగ్ ఆర్పీ తనే అని ఫిక్స్ అయిపోయి మరీ ఆమెతో వాదులాటకి దిగాడు. అయితే తీరా చూస్తే అమ్మడు హ్యాట్యాగ్ ఆర్పీ అని పెట్టింది రిషబ్ పంత్ గురించి కాదు రామ్ పోతినేని గురించి అని తెలిసింది. దీనితో రిషబ్ రెస్పాండ్ అవుతున్నాడు కదా అని హ్యాట్యాగ్ ఆర్పీతో ఆమె అతన్ని ఓ



ఆట ఆడుకుందని అంటున్నారు. ఇంతకీ ఇక్కడ విషయం ఏంటంటే రామ్ పోతినేని బోయపాటి శ్రీను కలిసి చేస్తున్న సినిమాలో ఊర్వశి ఓ స్పెషల్ సాంగ్ చేస్తుంది. డైరెక్ట్ గా సాంగ్ చేస్తున్నా అంటూ ప్రచారం మొదలు పెడితే ఏం కిక్ ఉంటుంది. అందుకే హ్యాట్యాగ్ ఆర్పీ అంటూ కొద్దిరోజులు టైం పాస్ చేసింది అమ్మడు. హ్యాట్యాగ్ ఆర్పీ అని పెట్టగానే ఇది తనకే తగులుతుంది అనుకుని ఆమె చేసిన ప్రతి కామెంట్ కి అంతే స్ట్రాంగ్ రిప్లై ఇచ్చుకుంటూ వచ్చాడు రిషబ్ పంత్. ఇలా ఆమె మనసులో ఏదో పెట్టుకుని మరేదో చెప్పి ఇలా అనవసరమైన గొడవకు దారి తీసింది ఊర్వశి రౌతెల. చివరకు ఆమె ఆర్పీ అని పెట్టి చేసిన కామెంట్స్ రిషబ్ పంత్ గురించి కాదు రామ్ పోతినేని గురించి అని తెలిసే సరికి అందరు షాక్ అయ్యారు. ప్రస్తుతం రామ్ తో ఊర్వశి దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ ఫోటోని షేర్ చేస్తూ కూడా హ్యాట్యాగ్ ఆర్పీ అని మరోసారి రెచ్చిపోయింది ఊర్వశి. ఛాన్స్ దొరికితే ఎవరికి వారు మరొకరితో ఆటాడేందుకు సిద్ధమవుతారని ఈ విషయంతో మరోసారి ప్రూవ్ అయ్యింది. పాపం ఈ విషయం తెలియక రిషబ్ పంత్ అనవసరంగా చాలా డిస్టర్బ్ అయ్యాడని చెప్పొచ్చు. అందుకే ఊర్వశితో కాస్త జాగ్రత్త రామ్ అంటూ మన ఎనర్జిటిక్ స్టార్ కి సలహాలు ఇచ్చేస్తున్నారు నెటిజెన్లు.




# స్టార్ల కోసం కెరీర్ ని కిల్ చేసుకుంటున్నారా?



టాలీవుడ్ లో ప్రస్తుతం మునుపెన్నడూ లేని విధంగా సినిమాల నిర్మాణం జరుగుతోంది. మెగాస్టార్ చిరంజీవి నుంచి కిరణ్ అబ్బవరం వరకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ క్షణం తీసిక లేకుండా బిజీ బిజీగా గడిపేస్తున్నారు. దీంతో హీరోయిన్ లకు కూడా భారీగా డిమాండ్ ఏర్పడింది. స్టార్ హీరోలు మాత్రం స్టార్ హీరోయిన్ ల కోసం ఎదురుచూస్తుంటే మరి కొంత మంది హీరోలు మాత్రం కొత్త వారి కోసం అన్వేషిస్తున్నారు. స్టార్ హీరోలు టైర్ టు హీరోలు మాత్రం పూజా హెగ్డే రష్మిక మందన్న శృతిహాసన్ సోనాల్ చౌహాన్ వంటి హీరోయిన్ ల వెంట పడుతున్నారు. స్టార్ హీరోయిన్ ల కొరత వుండటం భారీ స్థాయిలో పారితోషికాలు పెంచేయడంతో ఇక ఈ మధ్య టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ హీరోయిన్ లు శ్రీలీల కృతిశెట్టి అంది వచ్చిన ఆఫర్లని దక్కించుకుంటూ పారితోషికాలని కూడా భారీగా డిమాండ్ చేస్తూ చాలా వరకు సినిమాలని ఆక్రమించేస్తున్నారు. అయితే కొంత మంది హీరోయిన్ లు మాత్రం స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాల కోసం వేచి చూస్తూ దగ్గరికి వచ్చిన అవకాశాల్ని వదులుకుంటున్నారు. కిరణ్ అబ్బవరంతో కలిసి ఎస్..ఆర్ కల్యాణ మండపం సినిమాలో నటించిన ప్రియాంక జవాల్కర్ భారీ అవకాశాల కోసం సోషల్ మీడియా వేదికగా అందాల విందు చేస్తూ ఫొటో షూట్ లకు పోజులిస్తూ తన విలువైన సమయాన్ని వృధా చేసుకుంటోంది. స్టార్ ల పక్కనే నటించే బంపర్ ఆఫర్ దక్కాలని వున్న అవకాశాలని వదులుకుంటోంది. ఇక డీజే టిల్లు మూవీతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చేసిన నేహా శెట్టి కూడా ఇదే పంథాని అనుసరిస్తూ భారీ రెమ్యునరేషన్ ని డిమాండ్ చేస్తూ వచ్చిన అవకాశాల్ని వదులుకుంటోంది. తను డిమాండ్ చేసిన మొత్తం ఇవ్వడానికి ఇష్టపడని నిర్మాతలు తనని కాదని మరో హీరోయిన్ ని ఫైనల్ చేసుకుంటున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించే సమయం రాకున్నా వారితో నటించాలని భారీగా డిమాండ్ చేస్తూ యంగ్ హీరోయిన్ లు తమ కెరీర్ కి తామే మంగళం పాడేసుకుంటుండటం పలువురిని షాక్ కు గురిచేస్తోంది. ఇస్మార్ట్ శంకర్‌తో వెలుగులోకి వచ్చిన కన్నడ బ్యూటీ నభా నటేష్ కూడా ఇదే పంథాని అనుసరిస్తూ కాలయాపన చేస్తోంది. స్టార్ తో మాత్రమే నటిస్తానని భీష్మించుకు కూర్చుంటున్న నభా నటేష్ కు తెలుగులో ఇప్పుడు ఒక్కటంటే ఒక్క అవకాశం కూడా లేకపోవడం గమనార్హం. స్టార్ హీరోల కోసం కెరీర్ ని ప్రమాదంలోకి నెట్టేస్తున్న ఈ హీరోయిన్ లు ఇప్పటికైనా మనసు మార్చుకుని తమ క్రేజ్ కి తగ్గ హీరోల సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇండస్ట్రీలో వుంటారు లేదా తెరమరుగైపోవడం ఖాయం అనే కామెంట్ లు వినిపిస్తున్నాయి.

# పెళ్లయినా కత్రినతో భాయ్ నీకిది తగునా?



బిగ్ బాస్ హిందీ ఇప్పటికే 15 సీజన్లు అద్భుత విజయం సాధించడంతో సీజన్ 16 అంతే గ్రాండ్ గా లాంచ్ అయిన సంగతి తెలిసిందే. సల్మాన్ ఖాన్ దీనికి హోస్ట్. బిగ్ బాస్ 16: గేమ్ బద్లేగా.. క్యుంకీ బిగ్ బాస్ ఖుద్ ఖేలేగా! అంటూ..హిందీ రియాలిటీ %ుఎ% సిరీస్ బిగ్ బాస్ పదహారవ సీజన్ వైభవంగా కొనసాగుతోంది. 1 అక్టోబర్ 2022 నుండి కలర్స్ %ుఎ%లో ప్రీమియర్ అవుతోంది. సల్మాన్ ఖాన్ పదమూడవ సారి ఈ షోను హోస్టింగ్ చేస్తున్నారు. మొట్టమొదటిసారిగా శేఖర్ సుమన్ తో ఒక కొత్త విభాగం–బిగ్ బులెటిన్ అంటూ సండే షోకి శేఖర్ సుమన్ హోస్ట్ చేసారు. వీకెండ్ కా వార్ ... అవి– శుక్రవర్ అండ్ శనివర్ క వార్ .. మునుపటి సీజన్ ల తరహాలో శని – ఆదివారాలకు బదులుగా శుక్రవారాలు – శనివారాలలో ప్రసారమవుతున్నాయి. మొట్టమొదటిసారిగా హౌస్ నుంచి మెంబర్ 'తొలగింపు' ఆదివారం కాకుండా శనివారాల్లో జరిగింది. దేశంలోనే అతిపెద్ద స్టార్లలో సల్మాన్ ఖాన్ ఈ షోని విజయవంతంగా నడిపిస్తున్న సంగతి తెలిసిందే. అతను దశాబ్ద కాలంగా హిందీలో బిగ్ బాస్ షోను హోస్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం 16వ సీజన్ రంజుగా జరుగుతోంది. ఈసారి వారాంతపు ఎపిసోడ్ లో కత్రినా కైఫ్ తో సల్మాన్ భాయ్ స్పెషల్ ట్రీట్ ప్లాన్ చేశాడని చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇప్పటికే ప్రోమో విడుదలై ఆకట్టుకుంది. మాజీ ప్రేయసితో భాయ్ స్పషల్ ఎపిసోడ్ గా ఇది అలరించనుంది. త్వరలో విడుదల కానున్న తన కొత్త చిత్రం 'ఫోన్ బూత్' ను ప్రమోట్ చేయడానికి కత్రినా కైఫ్ ఈ షోకి అతిథిగా విచ్చేసింది. ప్రోమోలో క్యాట్ –సల్మాన్ ఎప్పటిలానే కులాసాగా గడిపారు. 'టిప్ టిప్ బర్సా పానీ...' పాటకు డ్యాన్స్ లు చేస్తున్నారు. సల్మాన్ – కత్రినా కొన్నేళ్ల పాటు రిలేషన్ షిప్ లో ఉన్నారు. కానీ ఆ తర్వాత బ్రేకప్ అయ్యింది. కొంతకాలం పాటు రణబీర్ తో కత్రిన ఎఫైర్ హాట్ టాపిక్ అయ్యింది. కానీ ఆ బంధం కూడా బ్రేక్ అయ్యింది. ఇప్పుడు క్యాట్ మరో యంగ్ ట్యాలెంటెడ్ హీరో విక్కీ కౌశల్ ను వివాహం చేసుకున్నారు. ఈ జంట త్వరలో ఒక కొత్త అతిథిని తమ ఇంటికి ఆహ్వానిస్తున్నారని గుసగుసలు ఉన్నా అధికారికంగా కన్ఫామ్ కావాల్సి ఉంది. ప్రస్తుతానికి మాజీ ప్రియురాలితో కలిసి సల్మాన్ బిగ్ బాస్ 16 ఎపిసోడ్ ని రంజుగా పసందుగా సిద్ధం చేసారు.

# స్లీవ్ లెస్ సోకులు.. చితక్కొట్టేస్తున్న అందాలు..!

గ్లామర్ ఫీల్డ్ లో ఒక్కొక్కరికి ఒక్కోలా క్రేజ్ ఏర్పడుతుంది. కేవలం అభినయంతోనే కొందరు స్టార్ ఇమేజ్ తెచ్చుకోగా కొందరు గ్లామర్ ఎటాక్ తో ప్రేక్షకుల మనసులు దోచేస్తారు. అయితే ముందు గ్లామర్ షో చేయడానికి మొహమాట పడి అంతా అయ్యాక ఓ రేంజ్ లో రెచ్చిపోయినా సరే ఏమాత్రం లాభం ఉండదు. ప్రస్తుతం ఇలాంటి సేమ్ సీనే పూనం బజ్వా విషయంలో రిపీట్ అవుతుంది. ఎప్పుడో 2005లోనే మొదటి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన పూనం అప్పటి నుంచి తన ప్రయత్నాలు తాను చేస్తున్నా కథల సెలక్షన్ లో చేసిన పొరపాట్ల వల్ల అమ్మడు కెరియర్ లో వెనకపడ్డది. ఎలాగోలా కెరియర్ నెట్టుకు రావాలని హీరోయిన్ గా కాకపోయినా తనకు వచ్చిన ఛాన్సులను వాడుకుంటూ వచ్చింది. ఫైనల్ గా ఇప్పటికి ఒక క్లారిటీకి వచ్చిన అమ్మడు గ్లామర్ షోతో రెచ్చిపోవాలని ఫిక్స్ అయ్యింది. ఇదేదో అమ్మడు కెరియర్ మంచి ఫాం లో ఉన్నప్పుడు అనుకున్నా సరే స్టార్ అవకాశాలు వచ్చేవి. అప్పట్లో గ్లామర్ షో అంటే అయ్యో నా వల్ల కాదు అన్నట్టు చెప్పుకొచ్చిన అమ్మడు ఇప్పుడు సోషల్ మీడియాలో వాటితోనే కుర్రాళ్లని ఎట్రాక్ట్ చేస్తుంది. 37 ఏళ్ల ఈ భామ తన అందాలకు గట్టిగానే పనిచెబుతుందని తెలుస్తుంది. ఇన్ స్టా లో ఫోటో షూట్స్ తో హాట్ టాపిక్ గా నిలుస్తుంది పూనం బజ్వా. లేటెస్ట్ గా



అమ్మడు సోఫాలో సోయగాల వల వేస్తుంది. బ్లూ కలర్ స్లీవ్ లెస్ జాకెట్ తో.. అదే కలర్ ప్యాంట్ ధరించిన పూనం తన టాప్ అందాలతో ఆడియన్స్ ని మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. తనలా మరే హీరోయిన్ చేయలేదు అన్న రేంజ్ లో తన ఫోటో షూట్స్ తో రచ్చ రచ్చ చేస్తుంది పూనం బజ్వా. ఈమధ్యనే తన బోయ్ ఫ్రెండ్ ని కూడా పరిచయం చేసిన అమ్మడు అతనితో కూడా క్లోజ్ గా దిగిన ఫోటోలని కూడా తన ఫాలోవర్స్ కోసం సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది. ఇంత కష్టపడుతున్న పూనం కి ఈఫర్లు ఏమైనా వస్తున్నాయా అంటే తెలుగులో ఆమె దాదాపు ఫేడవుట్ కాగా కన్నడ మళయాళ భాషల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తూ వస్తుంది పూనం. అమ్మడి గ్లామర్ ఎటాక్ చూస్తుంటే ఈసారి తెలుగు ఆఫర్ ఎలాంటిది వచ్చినా సరే ఓకే చెప్పేందుకు రెడీ అన్నట్టు అనిపిస్తుంది. పూనం బజ్వా అందాల దాడికి సోషల్ మీడియా కూడా షేక్ అవుతుంది. అమ్మడి కష్టాన్ని గుర్తించి ఏ దర్శకుడైనా పిలిచి అవకాశం ఇస్తాడేమో చూడాలి.

# లైక్ షేర్ అంటున్న జాతిరత్నాలు ముద్దుగుమ్మ

మేర్లపాక గాంధీ దర్శకత్వంలో సంతోష్ శోభన్ హీరోగా రూపొందిన తాజా చిత్రం లైక్ షేర్ %డ% సబ్స్క్రైబ్. ఈ చిత్రంలో సంతోష్ శోభన్ కి జోడీగా జాతిరత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించింది. ఈ సినిమాను నవంబర్ 4న ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్న నేపథ్యంలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మీడియాతో ముచ్చటించింది. ఆ సందర్భంగా పలు విషయాలను పంచుకుంది. ఆమె మాట్లాడుతూ... లైక్ షేర్ %డ% సబ్స్క్రైబ్ చాలా మంచి కథ. బిగినింగ్ నుండి ఎడింగ్ వరకు చాలా లేయర్స్ వున్న స్క్రిప్ట్. ఇందులో ప్రతి పాత్రకు ఒక నేపథ్యం ఉంటూ కథలో భాగం అవుతుంది. ఇందులో ట్రావెల్ వ్లాగర్ గా కనిపిస్తా. వీడియోస్ కోసం దేశమంతా తిరిగే పాత్ర నాది. ఈ ప్రయాణంలో హీరోని కలుస్తా. తను కూడా ఒక ట్రావెల్ వ్లాగర్. కథ చాలా ఎంటర్ టైనింగా వుంటుంది. జాతిరత్నాలు తర్వాత కొన్ని సినిమాల్లో చిన్న రోల్స్ లో కనిపించా. లైక్ షేర్ %డ% సబ్స్క్రైబ్ హీరోయిన్ గా నా రెండో సినిమా. చాలా ఎక్సయిటెడ్ గా వుంది. జాతిరత్నాలు లానే ఈ సినిమా కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది. సంతోష్ శోభన్ చాలా హార్డ్ వర్క్ చేస్తారు. చాలా ప్యాషనేట్ గా పని చేస్తారు.



సంతోష్ శోభన్ తో నటించడం ఆనందంగా వుంది. 40 శాతం సినిమా అడవిలో జరుగుతుంది. ఇరవై రోజులు అడవిలోనే వున్నాం. సిగ్నల్ కూడా వుండదు. ట్రైలర్ లో ఒక ఊబి కనిపిస్తుంది. దాన్ని క్రియేట్ చేశాం. అలాగే యాక్షన్ చేజింగ్ సీన్లు వున్నాయి. 'చిట్టి' పాత్రని అందరూ అభిమానించారు. ఈ విషయం లో ఆనందంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. నా స్కిల్ పై నాకు పూర్తి నమ్మకం వుంది. అయితే ప్రేక్షకులు ఎలాంటి కంటెంట్ ని ఆదరిస్తారనేది కూడా ఇక్కడ కీలకం. నా పాత్ర వరకూ వంద శాతం బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తా. ప్రస్తుతం తమిళంలో సుసీంధిరన్ దర్శకత్వంలో విజయ్ అంటోనీ హీరో గా ఒక సినిమా చేస్తున్న. సుసీంధిరన్ గారు ఎంతో గౌరవం చూపిస్తారు. 25 ఏళ్ళు ఇండస్ట్రీలో పక్కాగా వుంటానని వారు చెప్పడం గొప్ప సంతోషాన్ని ఇస్తుంది. లిమిటేషన్లు ఏమీ లేవు. యాక్షన్ సూపర్ నేచురల్ సైకో థ్రిల్లర్స్ .. ఇలా అన్నీ పాత్రలు చేయాలని వుంది. అయితే ఏ పాత్రని చేసిన రిలేటిబుల్ గా వుండాలి. రవితేజ రావణాసుర ఒక తమిళ్ మూవీ ఒక హిందీ సిరీస్ చేస్తున్నా. నాకు ఆర్ట్ ఫిలిమ్స్ చాలా ఇష్టం. అలాగే మ్యూజికల్ ఫిలిమ్స్ కూడా ఇష్టం. అయితే దర్శకత్వం ఇప్పుడు కాదు.. మరో పదేళ్ళు పడుతుంది.

# ప్రియమైన మోదీ కాదు.. పిరమైన మోదీ.. ధరల పెరుగుదలపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్ : గత కొంతకాలంగా భారీగా పెరుగుతున్న ధరలతో సామాన్యుల జీవితాలు కుదేలవుతున్నాయి. నిత్యవసర వస్తువుల నుంచి మొదలు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సహా అన్ని ధరలు అన్నీ ఆకాశన్నంటడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఈ పరిస్థితిపై మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ ఉప్పు పిరం.. పప్పు పిరం.. పెట్రోల్ పిరం.. డీజిల్ పిరం.. గ్యాస్ పిరం.. గ్యాస్‌పై వేసిన దోశ పిరం.. అన్నీ పిరం.. పిరం.. జనం అంత గరం.. గరం’ అంటూ ట్వీట్ చేశారు. అందుకే ప్రియమైన ప్రధాని మోదీ కాదు.. పిరమైన ప్రధాని మోదీ అని అంటున్నా అంటూ మంత్రి సెటైర్ వేశారు. ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడానికి కారణమైన అదనపు ఎక్సైజ్ సుంకం, సెస్‌ను ఎత్తివేయాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే నిత్యవసర వస్తువుల ధరలు ఏవిధంగా పెరిగాయి? వాటితో సామాన్యులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుపుతూ పలు పత్రికల్లో వచ్చిన వార్త కథనాలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను షేర్ చేశారు.

# దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలి..

## విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు : మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్ : విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటం ఆడుతోందని మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి పిల్లలతో క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. బాలల భవిష్యత్తుతో ఎవరైనా ఆడుకుంటారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. దమ్ముంటే రాజకీయంగా కొట్లాడాలని అన్నారు. కానీ ఇవాళ పిల్లల జీవితాలతో బీజేపీ పార్టీ చెలగాటం ఆడుతోందని అసహనం వ్యక్తం చేశారు. రాజకీయంగా కొట్లాడటం చేతగాక దిక్కుమాలిన, దిగజారుడు రాజకీయాలకు బీజేపీ పాల్పడుతోందని హరీశ్ రావు విమర్శించారు. పట్టపగలు బండి సంజయ్, బీజేపీ పార్టీ దొరికిపోయాయని హరీశ్ రావు అన్నారు. స్పష్టంగా దొరికిపోయినప్పటికీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. పిల్లల జీవితాలను తాకట్టు పెట్టి రాజకీయాలు అవసరమా అని బీజేపీ నేతలపై మండిపడ్డారు. ఏ ప్రభుత్వంపైనా భవిష్యత్తు తరాల కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని.. కేంద్రంలో బీజేపీ ఉందన్నారు. మనం భవిష్యత్తు తరాల కోసం పనిచేయాలి కానీ.. రాజకీయాల కోసం భవిష్యత్తు తరాల జీవితాలతో ఆడుకోవడం సమంజసం కాదన్నారు. ఇదంతా రాష్ట్ర, దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం ఏమో పేపర్ లీకైందని బీజేపీ నాయకులు ధర్నా చేసిన్రు.. సాయంత్రం ఏమో పేపర్ లీకేజీకి బాధ్యులై అరెస్టయిన వారిని విడుదల చేయాలని అదే బీజేపీ చేసిందని అన్నారు. దీన్ని బట్టి అరెస్టు అయ్యింది పక్కా బీజేపీ దొంగ.. బీజేపీ నాయకుడు.. బీజేపీ కార్యకర్త అని అర్థమవుతోందని అన్నారు. ‘ మీరే పథకం ప్రకారం లీకేజీలకు పాల్పడుతూ.. దాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ.. రాజకీయంగా వాడుకుని మా మీద బురద జల్లే ప్రయత్నం చేసిన్రు. పసిపిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేసే ప్రయత్నం చేసిన్రు.’ అని విమర్శించారు. బీజేపీ అంటేనే ఒక విద్వేషం.. ఒక విచ్ఛిన్నం చేసే కుట్ర, విధ్వంసం చేసే కుట్ర అని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఎంతసేపు రాజకీయాల కోసం, అధికారం కోసం ఏదైనా చేస్తారని అర్థమవుతుందని తెలిపారు.

దీన్ని విద్యార్థులంతా గమనిస్తున్నారని అన్నారు. విద్యార్థులు దీన్ని తిప్పికొట్టాలని.. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పదో తరగతి పిల్లలకు, తల్లిదండ్రులకు ఎక్కడా ప్రశ్నపత్రం లీకవ్వలేదు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ కుట్రలో మనం ఎవరం పడొద్దు. పిల్లలు బాగా చదువుకోవాలని, పిల్లల చదువు మీద దృష్టిపెట్టాలి. ‘ అని విద్యార్థులు, వాళ్ల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# పేపర్ లీకేజీ వ్యహారంలో బండి సంజయే కీలక సూత్రధారి: మంత్రి గంగుల



కరీంనగర్: పదోతరగతి పేపర్ లీక్ వ్యవహారంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కీలక సూత్రధారని మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేండ్లలో అనేక రకాల పరీక్షలు జరిగాయని, ఎప్పుడూ లీక్ కాని పేపర్లు ఇప్పుడే ఎందుకవుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. కరీంనగర్‌లో పార్టీ నాయకులతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడారు. కేవలం రానున్న ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలన్న కుట్రలో భాగంగా బీజేపీ ఆడుతున్న డ్రామాల్లో ఒక భాగం పేపర్‌లీకేజీ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న మంచి పేరును చెడగొట్టేందుకు బీజేపీ అధ్యక్షుడు సంజయ్ అనేక అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. బీహార్‌లో ఉన్న సంస్కృతిని ఇక్కడ తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ లీకుల్లోనూ బండి సంజయ్ అనుచరలే ఉన్నారని చెప్పారు. పదో తరగతి ప్రశ్నపత్రం లీక్ చేసింది కూడా ఆయనకు చెందిన వారేనని దీనిని బట్టి అర్థంచేసుకోవచ్చన్నారు. తన రాజకీయాలకోసం వేలాది మంది యువత, విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. పదో తరగతి పేపర్ లీకేజీ విషయం తెలియగానే.. ఒక బాధ్యత గల ఎంపీ ముందుగా ప్రభుత్వానికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. కానీ అలా చేయకుండా మొత్తం బీజేపీ గ్రూపుల్లో షేర్ చేయడం వెనుక పెద్దకుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తంచేశారు. పేపర్ లీకేజీ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు..? భవిష్యత్‌లో జరగబోయే పేపర్ లీకేజీలకు ఎమైనా కుట్రలు పన్నారా..? అనే వివరాలను ఒకటి రెండురోజుల్లో బయట పెడుతామన్నారు. ఇది ముమ్మాటికీ వందశాతం ముందస్తు ప్రణాళిక ప్రకారం సంజయ్ చేసిన దుశ్చర్చేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# బండి సంజయ్‌ను హనుమకొండ కోర్టులో హాజరుపర్చిన పోలీసులు



వరంగల్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం కేసులో అరెస్టయిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు హనుమకొండ కోర్టులో హాజరు పర్చారు. దీంతో హనుమ కొండ కోర్టు వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భాజపా శ్రేణులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో హనుమకొండ కోర్టు వెనుక ద్వారం నుంచి బండి సంజయ్‌ను తీసుకెళ్లారు. పాలకుర్తి ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం సంజయ్‌ను హనుమకొండ తరలించారు. బండి సంజయ్ తరఫు న్యాయవాదులను పోలీసులు కోర్టు ప్రాంగణంలోకి అనుమతించకపోవడంతో వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కోర్టు గేటుకు తాళాలు వేయడంతో న్యాయవాదులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బండి సంజయ్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసు వాహనంపై హనుమకొండ కోర్టు చౌరస్తా వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెప్పు విసిరాడు.

**ఏ1 నిందితుడిగా బండి సంజయ్ :** పదో తరగతి హిందీ ప్రశ్న పత్రం బయటకు వచ్చిన కేసులో బండి సంజయ్‌ను పోలీసులు ఏ1 నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో మొత్తం 9మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసుల రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. విద్యార్థుల్లో గందరగోళం సృష్టించేందుకు కుట్ర చేశారని సంజయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

బండి సంజయ్‌కు ప్ర శ్నపత్రం వాట్సప్ చేసి ప్రశాంత్‌ను ఏ2గా రిమాండ్ రిపోర్టులో పేర్కొ న్నారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్టు వెల్లడించారు.

# బండి సంజయ్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి : బాల్క సుమన్



బీఆర్ఎస్‌తో పోటీపడలేక బీజేపీ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. రాష్ట్రంలో అశాంతి, అలజడి సృష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని అన్నారు. ఢిల్లీ బీజేపీ పెద్దల డైరెక్షన్‌లోనే రాష్ట్ర బీజేపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పచ్చని తెలంగాణలో చిచ్చు పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని బాల్క సుమన్ విమర్శించారు. పదో తరగతి ప్రశ్నపత్రం వాట్సాప్‌లో పెట్టిన ప్రశాంత్‌ది బీజేపీ సోషల్ మీడియా విభాగంలో కీలక పాత్ర అని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే బీజేపీ నేతలకు కండ్లు మండుతున్నాయని విమర్శించారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కోలేకనే బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీ చిల్లర పనులకు తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ఎంపీగా బండి సంజయ్ లోక్‌సభ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని స్పీకర్‌ను కోరారు. బండి సంజయ్‌పై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు.




బొమ్మల రామారం: తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కారణం చెప్పకుండా తమ నేతను అరెస్ట్ చేశారంటూ కార్యకర్తలు మండిపడుతున్నారు. సంజయ్‌ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి భువనగిరి జిల్లా బొమ్మల రామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన నేపథ్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సహా భాజపా శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన మార్గాన్ని బారికేడ్లతో పోలీసులు మూసివేశారు. భాజపా కార్యకర్తలను అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అనంతరం పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. భాజపా కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో సంజయ్‌ను బొమ్మల రామారం నుంచి వేరే చోటుకు తరలించే అవకాశముంది.

**పోలీసుల అదుపులో ఎమ్మెల్యే రఘునందన్ :** మరోవైపు పోలీస్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్యే రఘునందన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. సంజయ్‌ను పరామర్శించేందుకు వస్తే తనను అడ్డుకోవడమేంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం రఘునందన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా తనను అడ్డుకున్నారన్నారు. బండి సంజయ్‌ను ఏ కేసులో.. ఎందుకు అరెస్ట్ చేశారో పోలీసులు చెప్పడం లేదని రఘునందన్ మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు పాటించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కారణం చెప్పకుండా అరెస్ట్ చేస్తారా?: ఈటల, డీకే అరుణ ఆగ్రహం** బండి సంజయ్ అరెస్ట్‌పై భాజపా ముఖ్యనేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈటల రాజేందర్ చెప్పారు. ఒక ఎంపీని కారణం చెప్పకుండా అరెస్ట్ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ చెప్పినట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు, తప్పుదోవ పట్టించేందుకే సంజయ్‌ను అరెస్ట్ చేశారన్నారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంజయ్ అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ చెప్పారు. భారాసకు కాలం చెల్లిందని.. ప్రజలు త్వరలోనే ఆ పార్టీకి బుద్ధి చెబుతారని ఆమె వ్యాఖ్యానించారు. ఓ జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ అని కూడా చూడకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుమాలిన చర్యగా అరుణ అభివర్ణించారు.

**హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన భాజపా :** సంజయ్ అరెస్ట్‌పై భాజపా హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు హౌస్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అర్ధరాత్రి ఆయన్ను అక్రమంగా అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. బండి సంజయ్‌ను న్యాయస్థానంలో హాజరుపరిస్తే మరో పిటిషన్ దాఖలు చేసే యోచనలో భాజపా ఉన్నట్లు సమాచారం. హెబియస్ కార్పస్ బదులు అక్రమ అరెస్ట్ పిటిషన్‌ను దాఖలు చేసే అవకాశాలను ఆ పార్టీ లీగల్ సెల్ నేతలు పరిశీలిస్తున్నారు. సంబంధిత కోర్టు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోనున్నారు.




పోలీసులు అకస్మాత్తుగా ఇంటిపై దాడి చేసి తన భర్త బండి సంజయ్‌ను అరెస్ట్ చేయడంతో తీవ్ర భయాందోళనకు గురైనట్లు ఆయన సతీమణి అపర్ణ తెలిపారు. బండి సంజయ్ హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకున్న కొద్దిసేపట్లోనే పోలీసులు దాడి చేయడం పట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన మాతృమూర్తితో బండి సంజయ్‌కుకు ఎంతో అనుబంధం ఉందని.. చిన్న కర్మకు హాజరయ్యేందుకు వచ్చిన తరుణంలో అక్రమంగా ఆయన్ను అరెస్టు చేశారని ఆమె పేర్కొన్నారు. ఓ ప్రజాప్రతినిధిని అరెస్టు చేయడంలో కనీస నిబంధనలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఎక్కడికి తీసుకెళ్తున్నారో సమాచారం ఇవ్వకుండా భీతావహ వాతావరణాన్ని నెలకొల్పారని చెప్పారు.

# బండి సంజయ్ అరెస్టు.. ఎందుకో తెలియదా?: డీజీపీపై కిషన్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుకు కారణాలేంటో చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ అంజనీకుమార్‌కు ఆయన ఫోన్ చేశారు. కారణాలు చూపకుండా సంజయ్‌ను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. డీజీపీ సమాధానమిస్తూ కేసు వివరాలు కాసేపటి తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. దీంతో డీజీపీపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌ను అరెస్ట్ విషయంలో ఇంత హంగామా జరుగుతున్నా ఏ కేసులో ఆయన్ను అరెస్టు చేశారో తెలియదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో పోలీసు వ్యవస్థ పనితీరుకు ఇది నిదర్శనమన్నారు. ఈ విషయంలో డీజీపీ వ్యవహరిస్తున్న తీరు దురదృష్టకరమని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.




బొమ్మల రామారం పోలీస్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్యే రఘునందన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. సంజయ్‌ను పరామర్శించేందుకు వస్తే తనను అడ్డుకోవడమేంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం రఘునందన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అని కూడా చూడకుండా తనను అడ్డుకున్నారన్నారు. బండి సంజయ్‌ను ఏ కేసులో.. ఎందుకు అరెస్ట్ చేశారో పోలీసులు చెప్పడం లేదని రఘునందన్ మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు పాటించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కుట్రలో భాగంగానే హిందీ ప్రశ్నపత్రం లీక్: మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్: తమ రాజకీయ అవసరాల కోసం బీజేపీ నాయకులు పేపర్ లీక్ చేసి విద్యార్థులు, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందీ పేపర్‌ను లీక్ చేసిన బీజేపీ నాయకుడు వెంటనే దానిని ఆ పార్టీ అధ్యక్షుడైన బండి సంజయ్‌కి పంపించడం, ఆయన మీడియాకు సమాచారం అందించడం కుట్రలో భాగమేనని చెప్పారు. టెన్త్ హిందీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్‌నగర్‌లో స్పందించారు. పేపర్ బయటికి వచ్చిందని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షునికి సమాచారం ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు.

మీడియావాళ్లకు సమాచారం అందించి రాద్ధాంతం చేశారంటే దాని వెనుకున్న కుట్రను అర్థం చేసుకోవాలన్నారు. పేపర్‌ను వందల వాట్సప్ గ్రూపులకు షేర్‌చేసి విద్యార్థులను భయాందోళనలకు ఎందుకు గురిచేశారని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లను లీక్ చేసిన నిందితుడు కూడా బీజేపీ కార్యకర్తేనని విమర్శించారు. ఇప్పుడు పదో తరగతి పేపర్ లీక్ పేరుతో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజ్ చేయడం సర్వసాధారణం కాబట్టి ఆ కుట్రలను తెలంగాణలో అమలు చేసి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు ఆరోపించారు. పదో తరగతి పేపర్ లీకేజీ కుట్రలో ఉన్నది ఎవరైనా, వారెంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైనదని, ఇలాంటి కుట్రదారులను వెంటనే అరెస్టు చేసి, మరోసారి ఇలాంటి ఆలోచన చేయాలంటేనే భయపడేలా చేస్తామన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్రం ఆ విషయాన్ని పక్కన పెట్టి ప్రైవేటీకరణ పేరుతో ఉన్న ఉద్యోగాలను కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. పేపర్ లీకేజ్ ద్వారా తెలంగాణకు అప్రతిష్ఠ తెచ్చేందుకు చేస్తున్న కుట్రలను ఆపి.. రాష్ట్రాభివృద్ధికి అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని హితవు పలికారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com